ప్రజాశక్తి
మంగళవారం 22 ఆగస్టు 2023
8 పేజీలు



విశాఖపట్నం



అనకాపల్లి

మెట్రోకు మోకాలడ్డిన కేంద్రం

- ఫీజిబిలిటీ లేదంటూ కొత్త రాగం
- కిక్కురుమనని రాష్ట్ర ప్రభుత్వం

ప్రజాశక్తి - గ్రేటర్ విశాఖ బ్యూరో

కేంద్రం ఎగవేతల ఖాతాలోకి మెట్రో రైలు కూడా పోయింది. అందరూ ఊహించినట్టే విశాఖలో మెట్రో రైలుకు ఎర్రజెండా చూపింది. పెరుగుతున్న జనాభా రీత్యా విశాఖ నగరంలో మెట్రో రైలు ఇప్పటికే పడాల్సిందంటూ ఆర్ఐఎన్ఎల్ నిపుణులు చెబుతున్నా కేంద్రం చెవికెక్కలేదు. 2019 ఎన్నికల్లో గెలుపుకోసం చంద్రబాబు ఈ మెట్రో అజెండాను 2017లో వాడుకున్నారు. కానీ ఈ పాచిక పారలేదు. 2018లో పనులు ప్రారంభమవుతాయని చంద్రబాబు చెప్పినా వ్యయాభారంతో మొదలు కాలేదు. కేంద్రంలోని బిజెపి సర్కారు అండతో ఎస్సెల్ ఎన్‌ఫ్రా కనార్సర్టియం దాఖలు చేసిన ఒకే ఒక బిడ్‌ను కూడా 2019లో



అధికారంలోకొచ్చిన వైసిపి సర్కారు రద్దు చేసింది. అంటే గత సవివరణ పథక నివేదిక (డిపిఆర్) రద్దయినట్టే. ఆర్థిక అవస్థల్లో కొట్టుమిట్టాడుతున్న తమ ప్రభుత్వానికి ఇదో శరాఘాతంగా మారనుండడంతో పాత టెండరును రద్దు చేసినట్లు వైసిపి సర్కారు అప్పట్లో ప్రకటించింది. ఆ తరువాత పలు పరిణామాలు మిగతా 2లో..

కరువు ఛాయలు

- సగం కూడా నమోదుకాని సాగు
- కానరాని కంటెంజెన్సీ ప్రణాళిక
- ఉపాధ్యాయుల సర్దుబాటుతో గందరగోళం
- పివిటిజిలకు ఇవ్వని అంత్యోదయ కార్డులు
- నేటి జిల్లా పరిషత్ సమావేశంలో ప్రస్తావనకు అవకాశం

ప్రజాశక్తి-అనకాపల్లి ప్రతినిధి

ఉమ్మడి విశాఖపట్నం జిల్లాలోని పాడేరు డివిజన్ 11 మండలాలు మినహా మిగిలిన ప్రాంతంలో ఖరీఫ్ పంటల సాగు అత్యంత ఆందోళనకరంగా వుంది. ఏజెన్సీలో హుకుంపేట, చింతపల్లి, జికె వీధి మండలాల్లో వర్షపాతం లోటువుంది. ఇతర మండలాల్లో వర్షాలు పడ్డంతో సాధారణ విస్తీర్ణంలో దాదాపు సగం వరకు పంటలు నమోదయ్యాయి. అనకాపల్లి, విశాఖపట్నం జిల్లాల్లో వర్షాలు సకాలంలో పడకపోవడంతో సాధారణ విస్తీర్ణంలో సగం కూడా సాగుకాలేదు. ప్రస్తుత విశాఖ జిల్లాలోని సాధారణ సాగు విస్తీర్ణం 13,937 ఎకరాలకు 910 ఎకరాల్లో పంట నమోదైంది. అనకాపల్లి జిల్లాలో 2,04,982 ఎకరాలకు 18,360 ఎకరాల్లో పంట నమోదైంది. అనేక చోట్ల ఆకు మడులు ఎండిపోతున్నాయి. నాట్లు వేసిన పొలాలు కూడా ఎండలకు బీటలుదేరుతున్నాయి. మరో పది, పదిహేను రోజుల్లో వరి సాగుకు గడువు ముగియనుంది. అయినా సగం విస్తీర్ణంలో కూడా పంట నమోదుకాలేదు. కొన్ని ప్రాంతాల్లో ఉడుపులకు సరిపడా ఆకులేని పరిస్థితి నెలకొంది. ఖరీఫ్ పరిస్థితి నిరాశాజనకంగా వున్నప్పటికీ స్వల్పకాలిక పంటల ప్రణాళిక వ్యవసాయశాఖ తయారుచేయలేదు. రైతులను ఆదుకొనే చర్యలేవీ ప్రభుత్వం చేపట్టలేదు. అనకాపల్లి జిల్లాలో జూన్ ఒకటి నుంచి ఆగస్టు 21 వరకు సగటున 424.3 మిల్లీమీటర్ల వర్షపాతం నమోదుకావాల్సివుండగా, 341.5 మిల్లీ మీటర్లు నమోదైంది. నాతవరం మండలంలో - 21.9, రోలుగుంటలో -19.9, కె.కోటపాడులో -32.5, సబ్బవరంలో - 23.6, అనకాపల్లిలో - 39.5, మాకవరపాలెంలో - 32.2, మునగపాకలో - 37.4, అచ్యుతాపురంలో - 30.6, యలమంచిలిలో - 41.2, నక్కపల్లిలో - 43.8, పాయకరావుపేటలో - 36.7, రాంబిల్లిలో - 30.5 వర్షపాతం లోటువుంది. విశాఖపట్నం మిగతా 2లో..



క్షతగాత్రుని పరామర్శిస్తున్న జెడ్‌పి చైర్‌పర్సన్ సుభద్ర

బస్సు ప్రమాద బాధితుల

ఆరోగ్యంపై ఆరా

వార్త 5లో..

కరువు ఛాయలు

(మొదటి పేజీ తరువాయి..) జిల్లాలో 375.8 మిల్లీమీటర్లకు 368.8 మిల్లీమీటర్లు, అల్లూరి సీతారామరాజు జిల్లాలో 637.4 మిల్లీమీటర్లకు 566.7 మిల్లీమీటర్లు నమోదైంది. పాడేరు డివిజన్‌లోని హుకుంపేటలో – 38. చింతపల్లిలో – 45.3, జికె.వీధిలో – 40.6 వర్షపాతం లోటువుంది.

విద్యా రంగం మరింత దిగజారేలా చర్యలు

ప్రభుత్వ పాఠశాలల్లోని పదో తరగతి ఫలితాలు సంతృప్తికరంగాలేవని మే 23న జరిగిన జిల్లా పరిషత్ సమావేశంలో సభ్యులు ఏకరువు పెట్టారు. ఫలితాలు రాకపోవడానికి కారణాలను గుర్తించి, లోపాలను సరిచేయాలని సూచించారు. ఫలితాలు మెరుగుపడేందుకు చర్యలు తీసుకోవాలని కోరారు. విద్యాశాఖ అందుకు భిన్నంగా ఫలితాలు మరింత దిగజారే చర్యలు చేపడుతోంది. జూన్‌లో బదిలీపై వెళ్లిన ఉపాధ్యాయులు ఆ ప్రాంత పరిస్థితులకు అలవాటుపడకముందే, వారిని వర్క్ అడ్జెస్ట్‌మెంట్ పేరుతో మళ్లీ వేర్వేరు చోట్లకు పంపించే ఏర్పాట్లు ప్రభుత్వం చేస్తోంది. ఆగస్టు 31 వరకు విద్యార్థుల ప్రవేశాలకు గడువు వుండగానే, ఈ ఏడాది జులై 31 నాటి విద్యార్థుల సంఖ్యను ప్రామాణికంగా తీసుకొని ఉపాధ్యాయులను సర్దుబాటు చేస్తోంది. ఉపాధ్యాయుల మిగులు చూపుతోంది. పరవాడ మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ బాలికల ఉన్నత పాఠశాలలో గతేడాది ఆరు నుంచి పది తరగతుల పిల్లలు 405 మంది వున్నప్పుడు ఇద్దరు ఫిజికల్ సైన్సు ఉపాధ్యాయులు పనిచేశారు. ఇప్పుడు ఆ సంఖ్య 430కు పెరిగాక ఇద్దరు ఫిజికల్ సైన్సు టీచర్లలో ఒక టీచర్‌ను విద్యాశాఖాధికారులు మిగులు చూపారు. దీంతో ఆ పాఠశాల పదో తరగతి ఉత్తీర్ణతపై ప్రభావం పడుతుందని తల్లిదండ్రులు ఆందోళన చెందుతున్నారు. వర్క్ అడ్జెస్ట్‌మెంట్ పేరుతో ఉమ్మడి జిల్లాలో 431 ఎస్‌జిటిలను మిగులు తేల్చారు.

పివిటిజిల కష్టాలివీ..

పాడేరు ఏజెన్సీ సహా కోటవురట్ల మండలం గొట్టివాడ పంచాయతీలోని అణుకు పివిటిజిలు అంత్యోదయ కార్డులు మంజూరు చేయాలని ఎంతోకాలంగా పోరాడుతున్నారు. అయినా అర్హత కలిగిన ఆదివాసీలకు అంత్యోదయ కార్డులు మంజూరు చేయలేదు. రహదారి నిర్మాణం చేపట్టాలని, ఆశా కార్యకర్తను నియమించాలని, జగనన్న ఇళ్లు మంజూరు చేయాలని అణుకు గిరిజనులు జులై ఏడు నుంచి రిలే నిరాహార దీక్షలు చేపడుతున్న విషయం తెలిసిందే. ఇలా జిల్లాలో వెంటాడుతున్న ప్రజా సమస్యలపై మంగళవారం జిల్లా పరిషత్ సమావేశ మందిరంలో జరగనున్న జిల్లా పరిషత్ సమావేశంలో సభ్యులు గళమెత్తనున్నారు. సభ్యులు ఏకోన్ముఖంగా ఒత్తిడి తీసుకొస్తే తప్ప సమస్యలకు పరిష్కారం లభించని పరిస్థితివుంది.

ఇండస్ ఇండ్ సంస్థ తీరు దారుణం

ప్రజాశక్తి – కలెక్టరేట్ : వాయిదాల పేరిట క్యాబ్ డ్రైవర్లను ఇబ్బందులకు గురి చేస్తున్న ఇండస్ ఇండ్ సంస్థపై కఠిన చర్యలు తీసుకోవాలని విశాఖ క్యాబ్ డ్రైవర్స్ యూనియన్ (సిఐటియు) గౌరవాధ్యక్షులు బి.జగన్ డిమాండ్ చేశారు. సదరు సంస్థ వైఖరిని నిరసిస్తూ రైల్వే న్యూకాలనీలో ఉన్న సంస్థ కార్యాలయం వద్ద సోమవారం ఆందోళన చేపట్టారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ కోవిడ్ సమయంలో ఇచ్చిన మారిటోరియంను సంబంధించి వాయిదాలు చివర్లో కట్టే అవకాశముందని, దాన్ని ఉల్లంఘించి ఇప్పుడు డబుల్ వాయిదాలు కట్టాలని చెప్పి సంస్థ వేధించడం తగదని అన్నారు. 2020లో సంభవించిన కరోనా వైరస్ కారణంగా అనేక ప్రైవేట్ ఫైనాన్స్ సంస్థలు కమర్షియల్ కార్లకు మారిటోరియం సదుపాయాన్ని కల్పించిన విషయాన్ని గుర్తుచేశారు. కార్యక్రమంలో విశాఖ క్యాబ్ డ్రైవర్ల యూనియన్ అధ్యక్షులు సిహెచ్.శ్రీనివాస్, కమిటీ సభ్యులు మనోహర్, రామ్మోహన్ పాల్గొన్నారు.

గెడ్డలో అనధికార నిర్మాణంపై చర్యలు తీసుకోండి

ప్రజాశక్తి – సీతమ్మధార : 'నగరంలో భూ కబ్జాల పర్వం కొనసాగుతోంది. జివిఎంసి జోన్ 3 పరిధి 26వ వార్డు రామకృష్ణనగర్‌లో డోర్ నెంబర్ 49-2-44/లో ఒక గ్రూప్ హౌస్ (జి ప్లస్ 3) నిర్మాణం ఉంది' అని సోమవారం జివిఎంసిలో నిర్వహించిన జగనన్నకు చెబుదాంలో వైసిపి 26వ వార్డు మహిళా అధ్యక్షురాలు పీలా వెంకటలక్ష్మి పోతు సత్యనారాయణ ఫిర్యాదు చేశారు. ఈ సందర్భంగా వీరు మాట్లాడుతూ తప్పుడు సర్వే నెంబర్లు 40, 41లను కలిపేసి ఈ సర్వే నెంబర్లపై ప్లాన్ పొందారని, దీనికి కేవలం 10 అడుగుల రోడ్డు మాత్రమే ఉందని, కానీ ప్లాన్‌లో 30 అడుగులు చూపించారని తెలిపారు. ఇక్కడగల 500 గజాల స్థలంలో 150 గజాల గెడ్డ స్థలాన్ని కబ్జా చేస్తున్నారని, తక్షణం చర్య తీసుకోవాలని ఫిర్యాదులో పేర్కొన్నారు. ఇదివరకు 12 అడుగుల రోడ్డు నిర్మాణం చేయాలని కోరుతూ నెడ్‌క్యాప్ ఛైర్మన్ కెకె.రాజుకు స్థానికులు లేఖను అందజేశారని పేర్కొన్నారు. కానీ దీన్ని 20 అడుగుల ఎగ్జిస్టింగ్ రోడ్డు ఉన్నట్లుగానూ, మరో 10 అడుగుల భవిష్యత్ ప్రతిపాదనకు అని చెప్పి ప్లాన్ పొంది నిర్మాణానికి దిగారని ఫిర్యాదులో పేర్కొన్నారు.

మొదటి పేజీ తరువాయి..

మెట్రోకు మోకాలడ్డిన కేంద్రం

చోటుచేసుకున్నాయి. పాత మెట్రో 44 కిలోమీటర్లే, కానీ కొత్తగా వైసిపి సర్కారు తయారు చేసిన మెట్రో పొడవు 144 కిలోమీటర్లు. పాత మెట్రోకు చంద్రబాబు హయాంలో సుమారు రూ.16 వేల కోట్ల మేర అంచనాలు రూపొందించగా, వైసిపి వచ్చాక అమాంతంగా రూ.27 వేల కోట్ల పైచిలుకు అంచనాలు తయారయ్యాయి. కేంద్రంలోని మోడీ సర్కారు కూడా భరోసా ఇచ్చినట్లు అప్పట్లో కేంద్ర పెద్దలు వెల్లడించారు.

మెట్రో రూట్ ఎలా ఉండాలని ఆశించారు?

వైసిపి ప్రభుత్వం 144 కిలోమీటర్ల మేర భోగాపురం ఎయిర్ పోర్టు నుంచి భీమిలి మీదుగా అనకాపల్లి వరకూ నిర్మించాలని ప్రణాళిక తయారు చేయించింది. అందుకుగాను రూ.27 వేల కోట్ల మేర అంచనాలు తయారయ్యాయి. ఆలస్యం అవుతున్న కొద్దీ వేల కోట్ల రూపాయల అంచనాలు పెరుగుతుండడంతో తాజాగా కేంద్రం కుండబద్దలు కొట్టేసింది. అండర్ గ్రౌండ్ నుంచి మెట్రో రైలు లైన్లు వేసేటప్పుడు పైన ఉన్న భవంతులకు పగుళ్లు ఏర్పడే అవకాశాలున్నాయని తాజాగా ఇంజినీర్ల కన్సార్టియం వెల్లడించినట్లు కేంద్రం బుకాయిస్తోంది. అమరావతి నిర్మాణానికే సాయం చుట్టేసిన కేంద్రం, వైజాగ్ రైల్వే జోన్‌కు ఎగనామం పెట్టేసి, స్టీల్‌ప్లాంట్‌ను చాప చుట్టేద్దామనుకున్న వైనాలన్నీ 'ఎగవేత ఖాతా'లకు కాక మరేమిటి ? అంటూ విశాఖకు చెందిన మేధావులు, కొన్ని ప్రభుత్వ శాఖల అధికారులు వ్యాఖ్యానిస్తున్నారు. కొత్త డిజైను ప్రకారం కొమ్మాది – స్టీల్‌ప్లాంట్ 34.23 కిలోమీటర్లు, గురుద్వారా – పాత పోస్టాఫీసు 5.25 కిలోమీటర్లు, తాటిచెట్ల పాలెం – చినవాల్తేరు 6.91 కిలోమీటర్లు వెరసి ఈ మొత్తం పనులన్నిటినీ అంటే 46.42 కిలోమీటర్ల మేర 2024లోగా మొదట దశలో పూర్తిచేయాలని డిపిఆర్‌లో పేర్కొన్నారు.

రెండో దశలో విశాఖ వ్యాలీ ఓల్డ్ లా కాలేజీ నుంచి మధురవాడ, ఐటి సెజ్ పార్కు, కొమ్మాది నుంచి ఆనందపురం జంక్షన్, ఇక్కడ నుంచి భోగాపురం ఎయిర్ పోర్టు వరకూ, స్టీల్ ప్లాంట్ నుంచి అనకాపల్లి రైల్వే స్టేషన్ వరకూ, పాత పోస్టాఫీసు నుంచి రుషికొండ బీచ్ వరకూ మొత్తం 77.31 కిలోమీటర్ల ట్రాక్ నిర్మాణాన్ని చేపట్టాలని.. 2028 నాటికి దీన్ని పూర్తిచేయాలని అంచనా వేశారు. మూడో దశలో రుషికొండ బీచ్ నుంచి భీమిలి వరకూ 16.4 కిలోమీటర్ల మేర ఒక కారిడార్ నిర్మాణం చేయాలనే మరో కొత్త ప్రతిపాదన కూడా ఉంది. నాలుగు కారిడార్లలో మెట్రో రైలు 28 స్టేషన్లుగా రానున్నట్లు ప్రకటించినా ఫలితం కానరావడం లేదు. నూతన మెట్రో కారిడార్ మొత్తం అనకాపల్లి వరకూ 144 కిలోమీటర్లుగా పేర్కొన్నప్పటికీ కేంద్రం తాజాగా తుస్సుమని గాలితీసేసింది.

బొత్స ఏమన్నారంటే..

ఇటీవల విశాఖ వైసిపి కార్యాలయంలో రాష్ట్ర విద్యా శాఖ మంత్రి బొత్స సత్యనారాయణ కొద్దిమంది మీడియా ప్రతినిధులతో పిచ్చాపాటిగా మాట్లాడారు. మెట్రో రైలుకు కార్యాలయం విశాఖ ఎల్‌ఐసి భవనంలో ఏర్పాటు చేసినా ఎందుకు ఆలస్యం అవుతోందని కొందరు ప్రశ్నించగా 'ఈ గవర్నమెంట్ ఉండగా మెట్రో వైజాగ్‌కు రాదు. వచ్చే ప్రభుత్వంలోనే అవకాశం ఉంది' అని వ్యాఖ్యానించారు.

సమస్యలపై వికలాంగుల ధర్నాలు



అనకాపల్లిలో ధర్నా చేస్తున్న వికలాంగులు

వికలాంగుల సమస్యలను పరిష్కరించాలంటూ విశాఖ, అనకాపల్లి జిల్లాల కలెక్టరేట్ల వద్ద సోమవారం వికలాంగుల హక్కుల జాతీయ వేదిక (ఎన్‌పిఆర్‌డి) ఆధ్వర్యాన వికలాంగులు ధర్నాలు చేపట్టారు. పింఛన్‌ను రూ.6 వేలుకు పెంచాలని డిమాండ్ చేశారు. అనంతరం జిల్లా కలెక్టర్లకు వినతిపత్రాలు అందజేశారు.

అనకాపల్లి : స్థానిక ఆర్‌డిఒ కార్యాలయం వద్ద, జిల్లా కలెక్టరేట్ వద్ద ఎన్‌పిఆర్‌డి ఆధ్వర్యాన నిర్వహించిన ధర్నాల్లో సంఘం రాష్ట్ర అధ్యక్షులు కె.అప్పలనాయుడు, జిల్లా కార్యదర్శి బుగిడి నూకప్పారావు మాట్లాడారు. రాష్ట్రంలో 13 లక్షలకుపైగా వికలాంగులున్నారని, వారంతా ప్రభుత్వాల నిరాదరణకు గురవుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. పెరుగుతున్న ధరలకు అనుగుణంగా పింఛన్‌ను రూ.6 వేలుకు పెంచి ఇవ్వాలన్నారు. అనకాపల్లి పట్టణంలో వికలాంగుల సంక్షేమ శాఖ కార్యాలయాన్ని ఏర్పాటు చేసి ప్రత్యేక అధికారిని నియమించాలన్నారు. బ్యాక్‌లాగ్ పోస్టులు భర్తీ చేయాలని కోరారు. కార్యక్రమంలో రాపేటి భాస్కరరావు, కాండ్రేగుల అప్పారావు, పెట్ల సన్యాసిరావు, నాదముని ఫణీంద్రకుమార్, రెహమాన్, బుద్ధ ధనలక్ష్మి, ఆడారి అన్నపూర్ణ, బొండా లక్ష్మి, కృష్ణవేణి, పలు మండలాల నుంచి వికలాంగులు పాల్గొన్నారు.

విశాఖ కలెక్టరేట్ : వికలాంగుల సమస్యలపై విశాఖ కలెక్టరేట్ ఎదుట ఎన్‌పిఆర్‌డి నాయకులు ఆందోళన చేపట్టారు. కార్యక్రమాన్ని ఉద్దేశించి సంఘం జిల్లా అధ్యక్షులు పాల వెంకయ్య మాట్లాడారు. సత్తిబాబు, పాపినాయుడు, మహాలక్ష్మిరెడ్డి, పి.నూకరాజు పాల్గొన్నారు.

సంక్షేమ హాస్టళ్లలో సమస్యలు పరిష్కరించాలి : ఎస్‌ఎఫ్‌ఐ

ప్రజాశక్తి-పెందుర్తి : సంక్షేమ హాస్టళ్లు, కళాశాలల్లోని సమస్యలు పరిష్కరించాలని ఎస్‌ఎఫ్‌ఐ జిల్లా కార్యదర్శి ఎల్‌జె.నాయుడు డిమాండ్‌చేశారు. విద్యా రంగ సమస్యలను పరిష్కరించాలంటూ ఎస్‌ఎఫ్‌ఐ విశాఖ జిల్లా కమిటీ ఆధ్వర్యాన చేపట్టిన 'విద్యార్థి సంఘర్షణ సైకిల్ యాత్ర' సోమవారం పెందుర్తి చేరుకుంది. పెందుర్తి ప్రాంతంలోని ప్రభుత్వ బాలురు, బాలికల వసతి గృహాలను సందర్శించారు. ప్రభుత్వ జూనియర్ కళాశాల విద్యార్థులతో మాట్లాడి సమస్యలనడిగి తెలుసుకున్నారు. మేఘాద్రి అంబేద్కర్ గురుకుల పాఠశాలను సందర్శించి సమస్యలనడిగి తెలుసుకున్నారు. అనంతరం ఎల్‌జె.నాయుడు మాట్లాడుతూ, ప్రభుత్వ బాలురు, బాలికల వసతి గృహాల్లో అనేక సమస్యలు ఉన్నాయన్నారు. ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ఫ్యాన్లు లేవని, ఇంతవరకు పాఠ్యపుస్తకాలు అందలేదని తెలిపారు. జిఒ 77ను ప్రవేశపెట్టి పీజీ విద్యార్థులకు విద్యాదీవెన లేకుండా చేశారని, దీంతో పేదలు ఉన్నత చదువులకు



పెందుర్తిలో వసతిగృహాల సందర్శనలో ఎస్‌ఎఫ్‌ఐ నాయకులు

వెళ్లకుండా జగన్మోహన్‌రెడ్డి ప్రభుత్వం తీవ్ర అన్యాయం చేశారని పేర్కొన్నారు. జిఒలు 107, 108 ద్వారా వైద్య విద్యను ప్రయివేటు పరం చేస్తున్నారని విమర్శించారు. రానున్న రోజుల్లో ఈ సమస్యలపై ఎస్‌ఎఫ్‌ఐ ఆధ్వర్యాన భారీ ఎత్తున ఆందోళనలు చేపడతామని హెచ్చరించారు.

గీతంలో డిగ్రీ, పీజీ ప్రవేశాలు

ప్రజాశక్తి -మధురవాడ : గీతమ్ డీమ్డ్ విశ్వవిద్యాలయం నిర్వహిస్తున్న డిగ్రీ, పీజీ కోర్సులలో ప్రవేశాలకు అడ్మిషన్ కౌన్సిలింగ్ నిర్వహిస్తున్నట్లు రిజిస్ట్రార్ ప్రొఫెసర్ డి.గుణశేఖరణ్ తెలిపారు. గీతంలో ఇంజినీరింగ్, ఎంబిఎ, బిబిఎ, బికామ్ మేనేజ్‌మెంట్ కోర్సులకు లా, ఆర్కిటెక్చర్, మెడికల్, ఫార్మశీ, ఫిజియోథెరపీ వంటి వృత్తి విద్యాకోర్సులతో పాటు ఎమ్మెస్సీ, బిఎస్సీ, బిఎ, ఎమ్ డిగ్రీ కోర్సులకు అడ్మిషన్ కౌన్సిలింగ్ నిర్వహిస్తున్నామన్నారు.

ఇంటర్మీడియట్ తత్సమాన కోర్సులు పూర్తి చేసిన వారికి బిఎస్సీ బయోటెక్నాలజీ, ఫుడ్ సైన్స్ అండ్ టెక్నాలజీ, స్టాటస్టిక్స్, బిసిఎ, ఫిజియోథెరపి, బిఫార్మశీ తో పాటు బిఎ ఎల్ఎల్‌బి, బిబిఎ, బిఎలో ఎకనామిక్స్, హిస్టరి, ఇంగ్లీష్, పొలిటికల్ సైన్స్, సోషియాలజి కోర్సులు నిర్వహిస్తున్నామని తెలిపారు. డిగ్రీ తత్సమాన అర్హత గల వారికి ఎమ్మెస్సీ డేటా సైన్స్, బయోటెక్నాలజీ, ఫుడ్ సైన్స్ అండ్ టెక్నాలజీ, మైక్రోబయాలజీ, కెమిస్ట్రీ, ఫిజిక్స్, మేథమెటిక్స్, ఎమ్ఎ కోర్సులలో ప్రవేశం కల్పిస్తామని పేర్కొన్నారు. పూర్తి సమాచారం కోసం గీతం అడ్మిషన్ల విభాగాన్ని సంప్రదించాలని సూచించారు.

హనుమాన్ విగ్రహావిష్కరణ

ప్రజాశక్తి - ఆరిలోవ : జివిఎంసి 9వ వార్డు పరిధి హనుమంతువాక కూడలిలో సుమారు 40 అడుగుల ఎత్తు గల హనుమాన్ విగ్రహాన్ని తూర్పు నియోజకవర్గ వైసిపి సమన్వయకర్త అక్కరమాని విజయనిర్మల, వార్డు కార్పొరేటర్ కోరుకొండ స్వాతిదాస్‌తో కలిసి మేయర్ గొలగాని హరి వెంకటకుమారి సోమవారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా మేయర్ మాట్లాడుతూ, హనుమంతువాక జంక్షన్ వద్ద ఉన్న రెండు కొండలపై అడుగులు వేస్తూ సంజీవ పర్వతాన్ని తెచ్చేందుకు హనుమంతుడు వెళ్ళారని చరిత్ర చెబుతోందన్నారు. అలా ఈ ప్రాంతానికి హనుమంతువాక జంక్షన్‌గా పేరు వచ్చిందని చెప్పారు. సుమారు రూ.60 లక్షల వ్యయంతో సంజీవ పర్వతంతో కూడిన హనుమాన్ విగ్రహాన్ని, వాటర్ ఫౌంటైన్, ఎల్ఇడి దీపాలతో పాటు భక్తులకు ఆహ్లాదం కలిగించే విధంగా ఆప్రాంతాన్ని అభివృద్ధి చేసినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో వైసిపి నాయకులు గొలగాని శ్రీనివాసరావు, ఉమ్మడి దాసు, జెడ్సీ కనక మహాలక్ష్మీ, జివిఎంసి పర్యవేక్షక ఇంజినీరు వేణుగోపాల్, కార్యనిర్వాహక ఇంజినీరు ప్రసాద్, ఎఇ సురేష్, స్థానిక సంఘాల నాయకులు పాల్గొన్నారు.

సేవలో యువత భాగస్వాములు కావాలి



రక్తదాన శిబిరం ప్రారంభంలో సిఐ రామచంద్రరావు

ప్రజాశక్తి -ఆనందపురం : సేవా కార్యక్రమాలలో యువత భాగస్వాములు కావాలని ఆనందపురం సిఐ రామచంద్రరావు సూచించారు. ఆనందపురం మండలం రామవరం గ్రామంలో మేము సైతం సేవా సొసైటీ 10వ వార్షికోత్సవంలో భాగంగా రక్తదాన శిబిరం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా సిఐ హాజరై మాట్లాడారు. మేము సైతం సేవా సొసైటీ సభ్యుల సేవలు ప్రశంసనీయమన్నారు. ఈ సొసైటీని స్ఫూర్తిగా తీసుకొని గ్రామాల్లో రక్తదాన శిబిరాలు ఏర్పాటుచేసి రక్తం కొరత లేని సమాజాన్ని నిర్మించాలని యువతను కోరారు.

మేము సైతం వ్యవస్థాపక అధ్యక్షుడు అక్కిరెడ్డి దేముడు బాబు మాట్లాడుతూ, రాష్ట్ర వ్యాప్తంగా సేవలను విస్తరిస్తామని చెప్పారు. ఈ సందర్భంగా 30 మంది దాతల నుంచి చత్రపతి శివాజీ బ్లడ్ బ్యాంక్ ఆధ్వర్యాన రక్తాన్ని సేకరించారు. అనంతరం పేదలకు నిత్యవసర సరుకులు అందజేశారు. ఈ కార్యక్రమంలో మేము సైతం అధ్యక్షులు గుర్ల రమణ, సెక్రటరీ ఎం.శ్రీనివాసరావు, రక్తదాన చైతన్యకర్త విజయబాలు, ఛత్రపతి శివాజీ బ్లడ్ బ్యాంక్ అధినేత భాస్కర్‌నాయుడు, వైసిపి వర్కింగ్ ప్రెసిడెంట్ మజ్జి వెంకట్రావు, నాయకులు కాకర్లపూడి సీతారామ రావు, వైస్ ఎంపిపి పండ్రంగి శీను, సర్పంచ్ ఎర్ర పైడిరాజు, ఎంపిటిసి సభ్యులు కృష్ణ, పాల్గొన్నారు.

ఎపిఎల్ చూశారు.. అదృష్టాన్ని దక్కించుకున్నారు...

ప్రజాశక్తి- పిఎం పాలెం : ఆంధ్ర క్రికెట్ ఆధ్వర్యాన జరుగుతున్న ఎపిఎల్ - 2 మ్యాచ్ చూసేందుకు వచ్చిన పలువురు క్రికెట్ అభిమానులు లక్కీ డ్రాలో విజేతలుగా నిలిచి విశాఖ కేంద్రంగా నవంబర్ 23న జరగనున్న ఇండియా వర్సెస్ ఆస్ట్రేలియా మ్యాచ్‌ను ఉచితంగా చూసే అవకాశాన్ని దక్కించుకున్నారు. ఏసీఏ కార్యదర్శి ఎస్ఆర్.గోపినాథ్‌రెడ్డి, సీఈవో ఎంవి.శివారెడ్డి లక్కీ డ్రా తీసి విజేతలను ఎంపిక చేశారు. అనంతరం గోపినాథ్ రెడ్డి మాట్లాడుతూ, ఏపీఎల్‌ను వీక్షించేందుకు వచ్చే వారు డాక్టర్ వైఎస్ఆర్ ఏసీఏ, విడిసిఎ క్రికెట్ స్టేడియంలోని 15, 16, 17, 18 గేట్ల వద్ద టికెట్లు ఉచితంగా పొందవచ్చన్నారు. స్టేడియంలో ఏర్పాటుచేసిన బాక్సుల్లో వేసే టికెట్లను లక్కీ డ్రా తీసి ప్రతి రోజూ 5 మంది విజేతలను ఎంపిక చేస్తున్నట్లు తెలిపారు. ఏపీఎల్ ను వీక్షించి ఇండియా వర్సెస్ ఆస్ట్రేలియా మ్యాచ్ ను ఉచితంగా చూసే అవకాశాన్ని దక్కించుకోవాలని కోరారు.

ఇప్పటి వరకు ఎంపికైన విజేతలు..

లక్కీ ద్వారా ఎంపికైనవారిలో శ్రీనివాసపత్ర, భరత్, గణేష్, శరత్, బుర్రా, దత్తా, రాహుల్, సతీష్‌కుమార్, సాయిసంపత్, భవేష్‌శ్రీజీత్, సుబ్రమణ్యాం, సమీర్, నరేంద్ర, పూర్ణ, స్వామి నాయుడు, యూసఫ్, షణ్ముఖ్, బాలకృష్ణ, గణేష్, అశోక్ ఉన్నారు.

రక్షణ గోడ నిర్మాణానికి శంకుస్థాపన

ప్రజాశక్తి - ఆరిలోవ : జివిఎంసి 9, 12 వార్డుల పరిధి కొండవాలు ప్రాంతమైన వినాయకనగర్‌లో రూ.40.36 లక్షల వ్యయంతో రక్షణ గోడ నిర్మాణానికి మేయర్ గొలగాని హరి వెంకట కుమారి, కార్పొరేటర్లు కోరుకొండ స్వాతిదాసు, అక్కరమాని రోహిణిలతో కలిసి సోమవారం శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా మేయర్ మాట్లాడుతూ, వినాయక నగర్‌లో ప్రజల రక్షణ, వరద నీటిని అరికట్టేందుకు రక్షణ గోడ నిర్మిస్తున్నట్టు తెలిపారు. ఈ కార్యక్రమంలో జెడ్సీ కనకమహాలక్ష్మీ, వైసిపి నాయకులు గొలగాని శ్రీనివాసరావు, ఉమ్మడి దాసు, స్థానిక సంఘాల నాయకులు మోహన్‌రెడ్డి పాల్గొన్నారు.

వేలం పాటల ద్వారా రూ.1.35 కోట్ల ఆదాయం

ప్రజాశక్తి-సింహాచలం: సింహాచల దేవస్థానం పరిపాలన విభాగంలో సోమవారం బహిరంగ, షీల్డ్ టెండర్ల వేలంపాట నిర్వహించగా టోల్‌గేట్ షీల్డ్ టెండర్ ద్వారా రూ.1.35 కోట్లకు కోడ్ చేసిన టెండర్‌ను ఖరారు చేశారు. దీంతోపాటు సన్నిధి పొలాలకు వేలంపాట నిర్వహించగా రూ.1.32 కోట్లకు టెండర్ రావడంతో గతం కంటే తక్కువ ఉందని పాట నిలిపివేశారు. ఈ కార్యక్రమంలో వెంకటేశ్వర స్వామి టెంపుల్ ఈవో సునీత, రమేష్, శ్రీనివాసరావు, పాల్గొన్నారు.

ఓపెన్ డ్రైయినేజీ నిర్మాణ పనులు వేగవంతం

ప్రజాశక్తి- భీమునిపట్నం : మండలంలోని టి.నగరపాలెం పంచాయతీ కొత్తూరులో రూ.20 లక్షలతో చేపట్టిన ఓపెన్ డ్రెయినేజీ నిర్మాణ పనులు వేగవంతంగా జరుగుతున్నాయి. సర్పంచ్ పొట్నూరు చాయా గౌతమి, ఎంపిటిసి సభ్యులు పల్లా నీలిమ, వైసిపి నాయకులు చంద్రశేఖర్, సన్యాసిరావు పర్యవేక్షణలో పనులు జరుగుతున్నాయి.

నేరాలు ఘోరాలు

మేడ పై నుంచి పడి బాలుడు మృతి

ప్రజాశక్తి-సీతమ్మధార : ప్రమాదవశాత్తు మేడపై నుంచి పడి బాలుడు మృతి చెందిన ఘటన నాలుగో పట్టణ పోలీస్ స్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది. పోలీసుల కథనం ప్రకారం... పెద్దూరు మసీదు వద్ద నివాసముంటున్న దర్శిక సాయి (9) ఇంటి వద్ద ఆడుకుంటూ మొదటి అంతస్తు నుంచి కింద పడిపోయాడు. తీవ్రగాయాలపాలైన బాలుడిని తల్లిదండ్రులు కెజిహెచ్‌కు తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ పరిస్థితి విషమించి బాలుడు మృతిచెందాడు. బాలుడు జ్ఞాననికేతన్ పాఠశాలలో నాలుగో తరగతి చదువుతున్నాడు. ఎస్ఐ గౌరి కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

హెటిరో ఉద్యోగి ఆత్మహత్య

ప్రజాశక్తి -నక్కపల్లి: మండలంలోని హెటిరో డ్రగ్స్ కంపెనీలో షిఫ్ట్ ఇన్చార్జిగా పనిచేస్తున్న బట్టా రామ గోవింద సత్య చంద్రశేఖర్ (42) సోమవారం మృతి చెందాడు..నర్సీపట్నంలోని శివపురం కి చెందిన బట్టా రామ గోవింద సత్య చంద్రశేఖర్ హెటిరో డ్రగ్స్ కంపెనీలో ఎన్ఆర్‌బ్లాక్‌లో షిఫ్ట్ ఇన్చార్జిగా 14 సంవత్సరాల నుండి పని చేస్తున్నారు.ఆదివారం రాత్రి సి షిఫ్ట్ డ్యూటీకి ఇంటి నుండి కంపెనీ బస్సులో వచ్చాడు. సహచర ఉద్యోగులతో కలిసి రాత్రి పని చేశారు. సోమవారం తెల్లవారుజామున చంద్రశేఖర్ కనిపించక పోవడంతో తోటి ఉద్యోగులు వెతకగా సమీపంలో ఉన్న రేకుల షెడ్‌లో ఉరేసుకున్నట్లు గుర్తించారు. కొన ఊపిరితో ఉండటంతో కంపెనీ అంబులెన్స్ లో నక్కపల్లి సి.హెచ్.సికి తరలించారు. వైద్యులు పరిశీలించి అప్పటికే మృతి చెందినట్లు ధ్రువీకరించారు. మృతిని భార్య శేష వరలక్ష్మి మాట్లాడుతూ, తన భర్తకు సీరియస్ గా ఉందని ఆసుపత్రికి రావాలంటూ కంపెనీ నుండి ఫోన్ వచ్చిందని వచ్చేసరికి ఆయన మృతి చెందారని పోలీసులకు ఫిర్యాదు చేసింది. మతుని ఆత్మహత్యకు కారణాలు తెలియలేదని, భార్య ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ శిరీష తెలిపారు. సంఘటనా స్థలాన్ని సిఐ అప్పన్న, ఎస్ఐ శిరీష పరిశీలించారు. పోస్టుమార్టం నిర్వహించి మృతదేహాన్ని మతుని కుటుంబ సభ్యులకు అప్పగించారు. మృతునికి ఇద్దరు పిల్లలు ఉన్నారు.

కుమార్తెను గర్భవతిని చేసిన తండ్రికి జీవితకాల శిక్ష

ప్రజాశక్తి-లీగల్ విలేకరి : వావి వరుసలు మరచి 15 ఏళ్ల కుమార్తెను గర్భవతి చేసిన తండ్రికి జీవితకాల శిక్ష విధిస్తూ విశాఖపట్నం ఫోక్సో కోర్ట్ న్యాయమూర్తి ఆనంది సోమవారం తీర్పు వెల్లడించారు. బాధిత బాలికకు రూ.10 లక్షలు నష్టపరిహారం ఇవ్వాలని తీర్పులో పేర్కొన్నారు. ప్రత్యేక పబ్లిక్ ప్రాసిక్యూటర్ కరణం కృష్ణ కథనం ప్రకారం... సుమారు 17 ఏళ్ల క్రితం శ్రీకాకుళం జిల్లా లావేరు మండలానికి చెందిన యువతితో మల్కాపురంలోని నిందితుడు ఎర్ర రామచంద్రుడుకు వివాహమైంది. సుమారు పదేళ్ల నుంచి భార్య మానసిక వ్యాధితో మంచాన పట్టింది. ఈ క్రమంలో ఎర్ర రామచంద్రుడు తన 15 ఏళ్ల పెద్ద కుమార్తెపై లైంగిక అఘాయిత్యానికి పాల్పడేవారు. దీంతో బాలిక గర్భవతి అయింది. ఈ విషయాన్ని ఇంటి సమీపంలోని మహిళలు గమనించి శ్రీకాకుళంలో ఉంటున్న బాలిక పిన్నికి సమాచారమందించారు. ఆమె వచ్చి మల్కాపురం పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. పోలీసులు దర్యాప్తు జరిపి బాలికపై లైంగిక వేధింపులు నిషేధిత చట్టం కింద నిందితునిపై కేసు నమోదుచేసి కోర్టులో ప్రవేశపెట్టారు. విచారణలో నేరం రుజువుకావడంతో న్యాయమూర్తి పై విధంగా శిక్షిస్తూ తీర్పు వెల్లడించారు.

బీమా అందజేత

ప్రజాశక్తి -భీమునిపట్నం : మండలంలోని మజ్జివలస పిఎసిఎస్ పరిధిలో మజ్జివలస గ్రామానికి చెందిన రైతులు జి.పాపారావు, జి.నారాయణ అనారోగ్యంతో మృతి చెందడంతో ఒక్కో కుటుంబానికి బీమా పథకం కింద రూ.15 వేలు చెక్కులను సోమవారం సర్పంచ్ తుపాకుల ఆదిలక్ష్మి, పిఎసిఎస్ అధ్యక్షులు చెల్లూరి పైడప్పడు, వైస్ ఎంపిపి బోని బంగారునాయుడు, సొసైటీ డైరెక్టర్లు గాడు తాతినాయుడు అందజేశారు. సొసైటీ కార్యాలయంలో జరిగిన ఈ కార్యక్రమంలో కార్యదర్శి జి.రామకృష్ణ, డి.ఎర్రయ్య, సచివాలయ కన్వీనర్ కొయ్య రామకృష్ణ పాల్గొన్నారు.

గుర్తు తెలియని వ్యక్తుల సమాచారమివ్వండి

ప్రజాశక్తి- భీమునిపట్నం : స్థానిక బీచ్‌ను పర్యాటకులు సందర్శించే క్రమంలో గుర్తు తెలియని వ్యక్తులు ఎవరైనా ఉన్నట్లు అనుమానం వస్తే వెంటనే భీమిలి పోలీసులకు సమాచారం ఇవ్వాలని స్థానిక సిఐ డి.రమేష్ కోరారు. బీచ్ వద్ద ఉన్న ఫొటోగ్రాఫర్లతో సోమవారం సిఐ సమావేశమై పలు సూచనలు చేశారు. బీచ్‌లో పర్యాటకుల ఫొటోలు తీసే పనిలో భాగంగా వారి పట్ల మర్యాద పూర్వకంగా మెలగాలని సూచించారు. బహిరంగంగా ఎవరైనా మద్యం తాగితే తమ దృష్టికి తీసుకురావాలని చెప్పారు.

టోల్‌గేట్ ఎత్తివేయాలని సిపిఎం, సిపిఐ ధర్నా

ప్రజాశక్తి-ఉక్కునగరం : అక్రమంగా నడుస్తున్న అగనంపూడి టోల్‌గేట్‌ను వెంటనే ఎత్తివేయాలని డిమాండ్‌చేస్తూ టోల్‌గేట్ వద్ద సిపిఎం, సిపిఐ అధ్వర్యాన సోమవారం ధర్నా నిర్వహించారు. సిపిఎం స్టీల్ జోన్ కార్యదర్శి పివిఎస్‌బి శ్రీనివాసరాజు, సిపిఐ గాజువాక నియోజకవర్గ కార్యదర్శి కసిరెడ్డి సత్యనారాయణ అధ్యక్షతన జరిగిన ధర్నానుద్దేశించి జివిఎంసి 78 వార్డు సిపిఎం కార్పొరేటర్ డాక్టర్ బి.గంగారావు మాట్లాడుతూ, చట్టవ్యతిరేకంగా నడుస్తున్న అగనంపూడి టోల్‌గేట్‌ను కేంద్రంలోని బిజెపి ప్రభుత్వం వెంటనే ఎత్తివేయాలని డిమాండ్ చేశారు. జివిఎంసి పరిధిలో టోల్‌గేట్ ఉండకూడదని చట్టం ఉండి, టోల్‌గేట్‌ను ఎత్తి వేయాలని జివిఎంసి తీర్మానం చేసినా దాన్ని కొనసాగిస్తూ ప్రజలను కేంద్రంలోని బిజెపి ప్రభుత్వం దోపిడీ చేస్తోందని విమర్శించారు. తాము సుప్రీంకోర్టులో వేసిన కేసు హియరింగ్‌కు వచ్చినా కేంద్ర ప్రభుత్వం వాయిదా వేయించేందుకు ప్రయత్నిస్తోందని చెప్పారు. టోల్‌గేట్‌ను వెంటనే ఎత్తివేయకపోతే ప్రజలను సమీకరించి తామే దాన్ని కూల్చివేస్తామని హెచ్చరించారు. సిపిఐ జిల్లా కార్యదర్శి ఎం.పైడిరాజు మాట్లాడుతూ, ఈ టోల్‌గేట్‌ను ఎత్తివేయడానికి రాష్ట్ర ప్రభుత్వం కనీసం స్పందించకపోవడాన్ని చూస్తే టోల్‌గేట్ యాజమాన్యంతో లాలూచీ పడుతోందని అర్థమవుతోందన్నారు. స్థానికంగా ఉన్న ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు, ప్రజాప్రతినిధులు వారి వ్యాపారాలు, వ్యవహారాల పట్ల ఉన్న శ్రద్ధ టోల్‌గేట్ సమస్యపై చూపడం లేదన్నారు. ప్రతిపక్ష తెలుగుదేశం పార్టీ ఈ సమస్యపై ప్రేక్షక పాత్ర పోషిస్తోందని విమర్శించారు. అనకాపల్లి నుంచి ఆనందపురం వరకు ఆరులైన్ల రోడ్డు పూర్తయిన వెంటనే ఈ టోల్‌గేట్ ఎత్తివేస్తామని సుప్రీంకోర్టుకు కేంద్ర ప్రభుత్వం తెలిపిందని, ఆరు లైన్ల హైవే పూర్తయినా నేటికీ ఎత్తివేయకపోవడం దుర్మార్గమన్నారు. ఈ ధర్నాలో సిపిఎం స్టీల్‌జోన్ నాయకులు మరిడయ్య, అయోధ్యరామ్, రామస్వామి, ఎన్.రామారావు, సిపిఐ నాయకులు రెహమాన్, అగనంపూడి అభివృద్ధి కమిటీ చైర్మన్ బలిరెడ్డి సత్యనారాయణ, ట్రాన్స్‌పోర్టు అసోసియేషన్ నాయకులు శ్రీనివాసరావు, శనివాడ కాలనీ అసోసియేషన్ నాయకులు సిహెచ్.నారాయణరావు, రామకృష్ణ ప్రసంగించారు. ధర్నాలో వందలాది మంది పాల్గొన్నారు.



టోల్‌గేట్ వద్ద ధర్నా చేస్తున్న సిపిఎం, సిపిఐ నాయకులు

కనీస వేతనాలు చెల్లించాలి : సిపిఐ

ప్రజాశక్తి -గాజువాక : అదానీ గంగవరం పోర్టు కార్మికులకు కనీస వేతనం రూ.36 వేలు చెల్లించాలని సిపిఐ డిమాండ్ చేసింది. సిపిఐ జిల్లా నాయకత్వం సోమవారం గంగవరం పోర్టు నిరసన దీక్షా శిబిరాన్ని సందర్శించి సంఘీభావం తెలిపింది. ఈ సందర్భంగా సిపిఐ విశాఖ జిల్లా కార్యదర్శి ఎం.పైడిరాజు మాట్లాడుతూ, కనీస వేతనాలు అమలు కోసం పోర్టు కార్మికులు 47 రోజులుగా దీక్షలు చేస్తున్నా అదానీ పోర్టు యాజమాన్యానికి చీమకుట్టి నట్టయినా లేదన్నారు. చాలీచాలని జీతాలతో పోర్టు కార్మికులు జీవనం సాగిస్తున్నారని ఆవేదన వ్యక్తంచేశారు. తక్షణమే అదానీ గంగవరం పోర్టు యాజమాన్యం స్పందించి కనీస వేతనాలు అమలు చేయాలని, లేని పక్షంలో ఆందోళనను మరింత ఉధృతం చేయాల్సి వస్తుందని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో సిపిఐ జిల్లా కార్యవర్గసభ్యులు కసిరెడ్డి సత్యనారాయణ, క్షేత్రపాల్, రెహమాన్, నాయకులు వై.నందన్న, జి.ఆనంద్, కె.అచ్యుతరావు పాల్గొన్నారు.

మణిపూర్ అల్లర్లను అదుపులోకి తేవాలి

ప్రజాశక్తి-ఉక్కునగరం : మణిపూర్‌లో దళిత క్రైస్తవులపై జరుగుతున్న అన్యాయాలను అరికట్టి వారిని ఆదుకోవాలని కోరుతూ సిద్ధార్థనగర్ నుంచి కూర్మన్నపాలెం మీదుగా ఊటల మందిరం వరకు చర్చి సభ్యులు శాంతి ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా చర్చి పాస్టర్ యబూ మాట్లాడుతూ, అక్కడ పరిస్థితులను సమీక్షించి శాంతిని నెలకొల్పేలా కేంద్ర ప్రభుత్వం కృషి చేయాలన్నారు. ఈ ర్యాలీకి స్టీల్‌ప్లాంట్ ఎస్సీ, ఎస్టీ అసోసియేషన్ నాయకులు బయ్యే మల్లయ్య, గుర్తింపు సంఘం అధ్యక్షులు ఆదినారాయణ తదితరులు మద్దతు తెలిపారు.

మణిపూర్‌లోని అలర్లను కేంద్ర ప్రభుత్వం జోక్యం చేసుకొని సద్దుమణిగేలా చేయాలని బహుజన సమాజ్ పార్టీ గాజువాక అధ్యక్షులు నందికొల్ల అప్పారావు డిమాండ్ చేశారు. కూర్మన్నపాలెం అంబేద్కర్ విజ్ఞాన కేంద్రంలో జరిగిన విలేకర్ల సమావేశంలో ఆయన మాట్లాడారు. అక్కడి ప్రజలు శాంతియుతంగా జీవించేలా కేంద్రం చర్యలు తీసుకోవాలని కోరారు.


మంత్రి అమర్‌నాథ్‌తో మాట్లాడుతున్న పప్పు రాజారావు

చేనేతల ఆత్మీయ సమావేశానికి ఆహ్వానం

ప్రజాశక్తి -గాజువాక : గాజువాలో ఈ నెల 27వ తేదీన నిర్వహించే చేనేతల ఆత్మీయ సమావేశానికి రాష్ట్ర మంత్రి గుడివాడ అమర్‌నాథ్‌ను గాజువాక చేనేత సంఘం నాయకులు సోమవారం మిందిలో కలిసి ఆహ్వానించారు. ఈ సందర్భంగా పలు సమస్యలపై గతంలో ఇచ్చిన వినతిపత్రం గురించి మంత్రి దృష్టికి తీసుకొచ్చారు. సంబంధిత ఫైళ్లను పరిశీలించి సానుకూలంగా నిర్ణయం తీసుకుంటానని మంత్రి హామీ ఇచ్చారు. మంత్రిని కలిసిన వారిలో బండారు ఆనందప్రసాద్, పప్పు రాజారావు, చిక్కా సత్యనారాయణ, సన్నిబాబు, నావాన సింహాచలం, కొల్లి కుంచారావు పాల్గొన్నారు.

అభివృద్ధి పనులు చేపట్టాలని వినతి

ప్రజాశక్తి- గోపాలపట్నం : జివిఎంసి 92వ వార్డులు అభివృద్ధి పనులు చేపట్టాలని కోరుతూ మేయర్ గొలగాని హరి వెంకటకుమారికి, కమిషనర్ సిఎం.సాయికాంత్‌వర్మకు కో-ఆప్షన్ సభ్యుడు బెహరా భాస్కరరావు వినతిపత్రాలు అందించారు. వార్డు పరిధి కంపరపాలెంలో పార్కు నిర్మాణం, ఉడా కాలనీలో పార్కు అభివృద్ధికి, వెంకటాపురంలో రోడ్డు, పంచముఖ ఆంజనేయ స్వామి గుడి వద్ద రోడ్డు వేయాలని వినతిలో కోరారు. జివిఎంసి కమిషనర్ సానుకూలంగా స్పందించి త్వరలోనే సమస్యలను పరిష్కరిస్తామని హామీ ఇచ్చారని భాస్కరరావు తెలిపారు. ఈ కార్యక్రమంలో వార్డు వైసిపి అధ్యక్షులు గొర్లె అప్పలస్వామినాయుడు, గొంతిన నాగరాజు, కంపర కోటేశ్వరరావు, కంపర రామకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

విద్యుత్ కనెక్షన్‌కు ఆధార్ అనుసంధానం

ప్రజాశక్తి -మధురవాడ : జోన్ 3 విద్యుత్ శాఖ పరిధిలో ఉన్న వినియోగదారులందరూ విద్యుత్ సర్వీస్‌కు ఆధార్ అనుసంధానం చేసుకోవాలని జోన్ 3 డిఇ పోలాకి శ్రీనివాసరావు కోరారు. ఆధార్ నెంబర్‌ను సర్వీస్ నెంబర్‌కు అనుసంధానించుకునేందుకు ఇపిడిసిఎల్ వెబ్ సైట్‌ను, ఇఆర్‌ఒ కార్యాలయాన్ని, సెక్షన్ ఆఫీస్‌ను, రెవెన్యూ క్యాషియర్‌ను, ఇతర వసూళ్ళ కేంద్రాలను ఆధార్ తీసుకొని వెళ్లి సంప్రదించాలని సూచించారు. ప్రతి వినియోగదారుడూ నెలవారీ బిల్లులను బిల్‌డెస్క్, పేటిఎం, ఫోన్‌పే, గూగుల్ పే, నెఫ్ట్, పేయు వెబ్, భీమ్ యాప్, ఎటిపి, ఈ సేవ, గ్రామ సచివాలయం, రాజీవ్ ఎపీఈపీసీఎల్ కేంద్రాల ద్వారా చెల్లించవచ్చని తెలిపారు.

ఘనంగా ఎన్ఎస్‌టిఎల్ వార్షికోత్సవం

ప్రజాశక్తి -కరాస: నేవల్ సైన్స్ అండ్ టెక్నాలజికల్ లేబొరేటరీ (ఎన్ఎస్‌టిఎల్) 54వ వార్షికోత్సవ సంబరాలను సోమవారం మానసి ఆడిటోరియంలో నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా నేవల్ సిస్టమ్స్ అండ్ మెటీరియల్స్ డైరెక్టర్ జనరల్ డాక్టర్ వై.శ్రీనివాసరావు, ప్రత్యేక అతిథిగా బివిఎస్ఎస్.కృష్ణకుమార్ హాజరయ్యారు. ఈ సందర్భంగా వై.శ్రీనివాసరావు మాట్లాడుతూ, 1969 ఆగస్టు 20న పదిమంది సిబ్బందితో ప్రారంభమైన ఎన్ఎస్‌టిఎల్ ప్రస్తుతం 172 మంది శాస్త్రవేత్తలు, 612 మంది సిబ్బందితో నడుస్తోందన్నారు. నీటి అడుగున ఆయుధాలు, వ్యవస్థలు రక్షణ ఆర్ అండ్ డి కి గణనీయమైన కృషి చేసిందని చెప్పారు. సానుకూల స్వదేశీ జాబితాలో తమ ఉత్పత్తులను చేర్చడం ద్వారా ఎన్ఎస్‌టిఎల్ బాధ్యత పెరిగిందన్నారు. అత్యాధునిక హైడ్రో డైనమిక్ రీసెర్చ్ సౌకర్యాల కారణంగా జలాంతర్గామిని రూపొందించే సామర్థ్యం ఎన్ఎస్‌టిఎల్‌కు ఉందని తెలిపారు. నీటి అడుగున అత్యాధునిక ఆయుధాలతో దేశ బలోపేతానికి కృషిచేస్తున్నట్లు పేర్కొన్నారు. అనంతరం వివిధ జాతీయ క్రీడల్లో ఎన్ఎస్‌టిఎల్‌కు ప్రాతినిధ్యం వహించిన క్రీడాకారులను, 25 ఏళ్ల సర్వీస్ పూర్తి చేసుకున్న సిబ్బందిని సత్కరించారు. ఈ కార్యక్రమంలో చైర్మన్ డాక్టర్ పిసి ప్రవీణ్, ఎన్ఎస్‌టిఎల్ డైరెక్టర్ డాక్టర్ అబ్రహం వర్గీస్, సివిల్ ఎంప్లాయీస్ యూనియన్ సెక్రటరీ జెఎన్.వర్మ, వర్క్స్ కమిటీ చైర్మన్ డాక్టర్ హెచ్ఎన్.దాస్, సెక్రటరీ జి.నాగభూషణం, సిహెచ్ చంద్రశేఖర్ తదితరులు పాల్గొన్నారు.

రిటైర్డ్ ఎంప్లాయీస్ అసోసియేషన్ వార్షికోత్సవం

ప్రజాశక్తి -మాధవధార : మాధవధార రిటైర్డ్ ఎంప్లాయీస్ వెల్ఫేర్ అసోసియేషన్ 38వ వార్షికోత్సవం మాధవధారలోని భరద్వాజ క్షేత్రంలో ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా భరద్వాజ క్షేత్రం నిర్వాహకులు సనపల జగదీశ్వరరావు హాజరై మాట్లాడారు. రిటైర్డ్ ఎంప్లాయీస్ వెల్ఫేర్ అసోసియేషన్ అభివృద్ధికి కృషి చేసిన విశ్రాంత ఉద్యోగులకు అభినందనలు తెలియజేశారు. అసోసియేషన్ ప్రారంభం నుంచి అనేక సేవా కార్యక్రమాలు నిర్వహించడాన్ని ప్రశంసించారు. అసోసియేషన్ అధ్యక్షులు సనపల రామ్‌గోపాలరావు మాట్లాడుతూ, అసోసియేషన్‌లోని సభ్యులు మృతి చెందితే దహనసంస్కార ఖర్చుల నిమిత్తం అసోసియేషన్ నుంచి రూ.9 వేలు, సభ్యుని భార్య మృతి చెందితే రూ.4,500 ఇస్తున్నట్లు తెలిపారు. ఈ సందర్భంగా భవిష్యత్తులో విశ్రాంత ఉద్యోగుల అభివృద్ధి కోసం మరిన్ని కార్యక్రమాలు నిర్వహించనున్నట్లు చెప్పారు. ఈ కార్యక్రమంలో శ్రీ మాధవ యువజన సమాజం సహాయ కన్వీనర్ పప్పల రామచంద్రరావు, బిటి స్వామి, పి.సంతోష్, ఎస్.రామానుజయ, ఎ.ఈశ్వరరావు, ఎస్ .ఉమాపతి, ఎస్.గిరి తదితరులు పాల్గొన్నారు.



వార్షికోత్సవంలో పాల్గొన్న రిటైర్డ్ ఎంప్లాయీస్ అసోసియేషన్ ప్రతినిధులు

24వ వార్డులో గడపగడపకు మన ప్రభుత్వం

ప్రజాశక్తి-సీతమ్మధార : జివిఎంసి 24వ వార్డు పరిధి గాంధీనగర్-2, సీతమ్మధార టిపిటి కాలనీలో సోమవారం గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించారు. ఉత్తర నియోజకవర్గ వైసిపి సమన్వయకర్త కెకె.రాజు, వార్డు కార్పొరేటర్ సాడి పద్మారెడ్డితో కలిసి ఇంటింటికీ వెళ్లి ఇప్పటివరకు ప్రభుత్వం చేపట్టిన సంక్షేమ పథకాల గురించి వివరించారు. ప్రజల సమస్యలనడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా కెకె.రాజు మాట్లాడుతూ, జగన్మోహన్‌రెడ్డి పరిపాలనలో ప్రజా ప్రతినిధులే గడప గడపకూ వెళ్లి ప్రజలను కలుసుకొని, వారి సమస్యలు తెలుసుకుని పరిష్కరిస్తున్నారని తెలిపారు. ఈ కార్యక్రమంలో జెసిఎస్ మండల కన్వీనర్ కర్రి మురళీకృష్ణారెడ్డి, అశోక్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

46, 47 వార్డుల్లో జివిఎంసి కమిషనర్ పర్యటన

ప్రజాశక్తి-సీతమ్మధార : జివిఎంసి 46, 47 వార్డుల పరిధిలోని కప్పరాడ స్వీపర్ కాలనీ, కైలాసపురం, కస్తూరినగర్, శాంతినగర్ తదితర ప్రాంతాలలో జివిఎంసి కమిషనర్ సిఎం.సాయికాంత్ వర్మ సోమవారం పర్యటించారు. ఈ సందర్భంగా 46వ వార్డులో ప్రధానంగా 24 X 7 తాగునీరు అందించాలని, శిథిలమైన కాలువలు, రోడ్లకు మరమ్మతులు చేపట్టాలని, కస్తూరినగర్ నుంచి జాతీయ రహదారి వరకు ప్రధాన గెడ్డను ఆధునికీకరించాలని, అసాంఘిక కార్యకలాపాలు జరుగుతున్న పోర్టు క్వార్టర్లలో నిఘా ఏర్పాటుకు చర్యలు చేపట్టాలని, తాటిచెట్లపాలెం నుంచి కైలాసపురం వరకు రోడ్డు ఫుట్ పాత్‌లు, కాలువలు నిర్మించాలని కమిషనర్‌ను డిప్యూటీ మేయర్ కట్టమూర్తి సతీష్ కోరారు. 47 వార్డులో కప్పరాడలో శిథిలావస్థలో ఉన్న కాలువలను నిర్మించాలని, తాగునీటి సమస్య తీర్చాలని, వీధిలైట్లు సరిగా వెలగడం లేదని, రోడ్లను ఆక్రమించి ఉన్న బడ్డీలను తొలగించాలని, 36-96-55 గల ఇంటిలోకి కాలువ నీరు వస్తోందని, పరిష్కరించాలని కమిషనర్‌ను కార్పొరేటర్ కంటిపాము కామేశ్వరి కోరారు.

'ఉత్తరం'లో గ్రీవెన్స్

ప్రజాశక్తి-సీతమ్మధార : ఉత్తర నియోజకవర్గంలో ప్రజల సమస్యలు పరిష్కరించేందుకు వైసిపి సమన్వయకర్త కెకె.రాజు సోమవారం పార్టీ కార్యాలయంలో గ్రీవెన్స్ నిర్వహించారు. ఈ సందర్భంగా నియోజకవర్గానికి చెందిన పలువురు సమస్యలతో కూడిన వినతిపత్రాలను కెకె.రాజుకు అందించారు. వినతిపత్రాలను పరిశీలించిన కెకె.రాజు అధికారులతో మాట్లాడి కొన్నింటిని వెంటనే పరిష్కరించారు. మరి కొన్నింటికి సంబంధించి అధికారులకు రిఫర్ చేసి త్వరలోనే పరిష్కరిస్తామని హామీ ఇచ్చారు.

స్పందనకు వినతులు

ప్రజాశక్తి -యంత్రాంగం

భీమునిపట్నం : జివిఎంసి ఒకటో జోన్ కార్యాలయంలో సోమవారం జరిగిన స్పందన కార్యక్రమంలో జెడ్సీ బొడ్డేపల్లి రాముకు స్థానికులు పలు సమస్యలపై 3 అర్జీలు అందజేశారు. ఇంజినీరింగ్ విభాగానికి సంబంధించి రెండు, పట్టణ ప్రణాళిక విభాగానికి సంబంధించి ఒక అర్జీ అందాయి. సంబంధిత అర్జీలను తదుపరి చర్యల నిమిత్తం ఆయా విభాగాల అధికారులకు పంపించారు.

అర్బన్ తహశీల్దార్ కార్యాలయానికి 15 వినతులు

సీతమ్మధార : అర్బన్ తహశీల్దార్ కార్యాలయంలో స్పందనకు 15 వినతులు వచ్చినట్లు తహశీల్దార్ ఆనంద్‌కుమార్ తెలిపారు. అర్జీలను పరిశీలించి పరిష్కరించాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. ఈ కార్యక్రమంలో డీటీ త్రినాధరావు పాల్గొన్నారు

కలెక్టర్‌కు ఫిర్యాదు

భీమునిపట్నం : మండలంలోని తాళ్ళవలస పంచాయతీ పరిధిలో ప్రభుత్వ స్థలాన్ని ఆక్రమించి ఇళ్ల నిర్మాణం చేపడుతున్న అధికార పార్టీ నాయకులపై చర్యలు తీసుకోవాలని కోరుతూ జిల్లా కలెక్టరేట్‌లో జరిగిన స్పందనలో స్థానిక జనసేన నాయకులు వైసూరి రెడ్డి ఫిర్యాదు చేశారు.ఈ విషయమై మండల రెవెన్యూ అధికారులకు ఈ ఏడాది జులై 12న ఫిర్యాదు చేయగా, కేవలం ప్రహరీని మాత్రమే తొలగించారని ఫిర్యాదులో పేర్కొన్నారు. ఫిర్యాదు చేసిన వారిలో కిరణ్ కుమార్ ఉన్నారు.

జివిఎంసిలో 'సౌకర్యం' ప్రారంభం

ప్రజాశక్తి-పెందుర్తి : జివిఎంసి 94వ వార్డు పరిధి వేపగుంట జోన్ కార్యాలయంలో రూ.35 లక్షలతో నిర్మించిన సౌకర్యం కేంద్రాన్ని ఎమ్మెల్యే అదీప్‌రాజు సోమవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ, పన్నులు కట్టేందుకు వచ్చిన ప్రజలు క్యూలో నిలబడి చాలా ఇబ్బందులు పడేవారని తెలిపారు. ఈ సౌకర్యం కేంద్రంలో ఏసీతో పాటు పలు మౌలిక వసతులు కల్పించినట్లు చెప్పారు. ఈ కార్యక్రమంలో 95వ వార్డు కార్పొరేటర్ ముమ్మన దేవుడు, జోనల్ కమిషనర్ మల్లయ్యనాయుడు, అధికారులు పాల్గొన్నారు.

హాస్టల్ విద్యార్థుల సమస్యలపై కలెక్టరేట్ వద్ద ధర్నా

ప్రజాశక్తి-అనకాపల్లి

హాస్టల్ విద్యార్థుల సమస్యలను పరిష్కరించాలని కోరుతూ భారత విద్యార్థి ఫెడరేషన్ (ఎస్ఎఫ్ఐ) ఆధ్వర్యంలో సోమవారం జిల్లా కలెక్టరేట్ వద్ద ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా ఎస్ఎఫ్ఐ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు మామిడి రమణ, ఎస్.నాగ రమణ మాట్లాడుతూ ఎస్‌టి హాస్టళ్లకు సొంత భవనాలు నిర్మించాలని, హాస్టల్ వర్కర్లను నియమించడం, పూర్తిస్థాయి మెనూ అమలు చేయాలని డిమాండ్ చేశారు. కాస్మోటిక్స్, నోట్ బుక్స్ సరఫరా చేయాలని, సబ్బవరం ఎస్సి హాస్టల్‌ను రెండు హాస్టల్స్‌గా నిర్వహించాలని, సబ్బవరంలో ఎస్టీ బాలికల హాస్టల్, బీసీ హాస్టల్ ఏర్పాటు చేయాలని డిమాండ్ చేశారు. ఎస్సీ, ఎస్టీ, బీసీ హాస్టళ్లలో మినరల్ వాటర్ ప్లాంట్స్ ఏర్పాటు చేయాలని కోరారు. విద్యార్థులకు దోమతెరలు ఇవ్వాలన్నారు. విద్యార్థుల మెనూ చార్జీల నుంచి జీతాలు ఇవ్వడం దుర్మార్గమన్నారు. ఎస్సి హాస్టల్ విద్యార్థులకు జిల్లా వ్యాప్తంగా రక్షణ లేకుండా పోయిందని, లోకల్ విద్యార్థులు వెళ్లి వారిపై దాడి చేసి గాయపర్చుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. డివైఎఫ్ఐ జిల్లా అధ్యక్షులు సిహెచ్ శివాజీ మాట్లాడుతూ జిల్లా వ్యాప్తంగా సంక్షేమ హాస్టళ్లలో మౌలిక వసతులు కల్పించాలని, ఖాళీ ఉద్యోగాలు భర్తీ చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో ఎస్ఎఫ్ఐ జిల్లా కోశాధికారి గొర్లి తరుణ్, వెంకటేష్, జిల్లా సహాయ కార్యదర్శి గీతాకృష్ణ, బాలాజీ, 600 మంది విద్యార్థులు పాల్గొన్నారు.



కలెక్టరేట్ ఎదుట ఎస్ఎఫ్ఐ ఆధ్వర్యాన ధర్నా చేస్తున్న హాస్టల్ విద్యార్థులు



సతీష్‌కు కేక్ తినిపిస్తున్న తల్లి, పక్కన తండ్రి వెంకటేశ్వరరావు తదితరులు

ఘనంగా ముత్యాల సతీష్ జన్మదిన వేడుకలు

ప్రజాశక్తి-అనకాపల్లి

ప్రముఖ వ్యాపారవేత్త ముత్యాల వెంకటేశ్వరరావు తనయుడు ముత్యాల సతీష్ (సంజూ బాబు) పుట్టినరోజు వేడుకలు సోమవారం పట్టణంలోని నరసింగరావు పేటలో గల వారి గృహం వద్ద ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా పలు సేవా కార్యక్రమాలు నిర్వహించారు. ముందుగా నూకాలమ్మ అమ్మవారి గుడిని కుటుంబ సమేతంగా వెళ్లి దర్శించుకున్నారు. అనకాపల్లి ఉపకారాగారంలో ఖైదీలకు పళ్ళ పండ్లు, రొట్టెలు పంపిణీ చేశారు. ఫ్యానులు వితరణ చేశారు. వికలాంగులకు, ఉడ్డుపేట జీవీఎంసీ ప్రైమరీ స్కూల్ మరమ్మతులకు ఆర్థిక సహాయం అందజేశారు. నెహ్రూ చౌక్ వద్ద నుండి సంజయ్ యువసేన సభ్యులు ఆధ్వర్యంలో 200 బైకులతో ర్యాలీ చేపట్టారు. అనంతరం ముత్యాల వెంకటేశ్వరరావు కుటుంబం సభ్యుల మధ్య సతీష్‌బాబు కేక్ కటింగ్ చేశారు. ఈ కార్యక్రమంలో మహిళలు, అభిమానులు, యువ సేన సభ్యులు పాల్గొన్నారు.



విజేతలైన విద్యార్థులతో పాఠశాల ప్రతినిధులు

చెస్ బాక్సింగ్‌లో సత్తా చాటిన 'సంస్కృతి' విద్యార్థులు

ప్రజాశక్తి-పరవాడ : చెస్ బాక్సింగ్ ఆర్గనైజేషన్ ఆఫ్ ఇండియా ఆధ్వర్యంలో ఈ నెల 3 వరకు డార్జిలింగ్‌లో జరిగిన 11వ జాతీయ చెస్ బాక్సింగ్ ఛాంపియన్ షిప్ పోటీలలో సంస్కృతి గ్లోబల్ స్కూల్ విద్యార్థులు సత్తాచాటారు. వివిధ విభాగాల్లో 12 మంది పతకాలు సాధించారు. ఈ సందర్భంగా విజేతలు క్రిష్ దెవని, ప్రియాంష్ సింగ్, ఎన్ హరిన్, ఐ.కౌశిక్, కె అభిరామ్, ఎల్ సాకేత్, బి.తేజశ్రీ, ఏ.నవ్యశ్రీ, ఎమ్.హాసిని, జి.హర్షిత, ఏ.హర్షిత, వి.వైష్ణవిలకు సోమవారం పాఠశాలలో అభినందన సభ ఏర్పాటు చేశారు. అంతర్జాతీయ అథ్లెటిక్స్ క్రీడాకారుడు చింత ప్రతాప్ చిన్నారులను అభినందించారు. ఈ సందర్భంగా పాఠశాల ప్రిన్సిపాల్ ఎన్.సీతాలక్ష్మి మాట్లాడుతూ అంతర్జాతీయ స్థాయిలో కూడా ప్రతిభ కనబర్చాలని, అందుకు తగ్గ శిక్షణ ఇప్పించడానికి స్కూల్ యాజమాన్యం సిద్ధంగా ఉందని తెలిపారు. కార్యక్రమంలో పాఠశాల సీఈఓ కె.నిశాంత్, స్పోర్ట్స్ డైరెక్టర్ జి.మధుబాబు, కోచ్‌లు మనీష్, కృష్ణవేణి పాల్గొన్నారు.

రాష్ట్రస్థాయి ఉత్తమ ఉపాధ్యాయ అవార్డులకు దరఖాస్తుల స్వీకరణ

ప్రజాశక్తి -అనకాపల్లి : రాష్ట్రస్థాయి ఉత్తమ ఉపాధ్యాయ అవార్డులకు దరఖాస్తులను ఆహ్వానిస్తున్నట్లు జిల్లా విద్యా అధికారి ఎం వెంకట లక్ష్మమ్మ సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. 2023 సెప్టెంబర్ 5న ఉపాధ్యాయుల దినోత్సవం సందర్భంగా ఉత్తమ ఉపాధ్యాయ పురస్కారాలను అందజేయనున్నట్లు వెల్లడించారు. ఆసక్తిగల ఉపాధ్యాయులు తగిన ఆధారాలతో యలమంచిలి డిప్యూటీ డిఇఒకు లేదా ఎంఇఒకు ఈ నెల 24లోగా దరఖాస్తులు అందజేయాలని కోరారు.

స్పందన అర్జీల పరిష్కారం వేగవంతం

ప్రజాశక్తి-అనకాపల్లి : స్పందన కార్యక్రమంలో వచ్చిన అర్జీలకు వేగంగా సమాధానాలు ఇవ్వాలని జిల్లా కలెక్టర్ రవి పటాన్ శెట్టి అధికారులను ఆదేశించారు. సోమవారం ఆయన స్పందన కార్యక్రమంలో ప్రజల నుండి దరఖాస్తులు, ఫిర్యాదులు స్వీకరించారు. కార్యక్రమంలో జాయింట్ కలెక్టర్ ఎం.జాహ్నవి, అసిస్టెంట్ కలెక్టర్ బి. స్వరణ్ రాజ్, డిఆర్‌డి ఏపిడి బి.లక్ష్మీపతి దరఖాస్తులను స్వీకరించారు. స్పందనలో 266 అర్జీలు వచ్చాయి.

అక్రమ నిర్మాణంపై ఫిర్యాదు

ప్రజాశక్తి -అనకాపల్లి : జీవీఎంసీ 81వ వార్డు జగన్నాథ్ థియేటర్ రోడ్లో బొడ్డేడ ధనలక్ష్మి (బిపిఆర్ఎం నివాస్) భవన నిర్మాణ చట్టాన్ని ఉల్లంఘిస్తూ చేపడుతున్న నిర్మాణంపై జీవీఎంసీ అధికారులు చర్యలు తీసుకోవాలని కోరుతూ సోమవారం జోనల్ కమిషనర్‌కు బొడ్డేడ గంగాధర్ ఫిర్యాదు చేశారు. ఈ సందర్భంగా గంగాధర్ మాట్లాడుతూ బిపిఆర్ఎం నివాస్ రోడ్డు నిబంధన ప్రకారం 30 అడుగుల రోడ్డు వేయాల్సి ఉండగా సుమారు 23 అడుగులు ఉన్నప్పటికీ భవన నిర్మాణానికి అనుమతులు ఎలా ఇచ్చారని ప్రశ్నించారు. భవన నిర్మాణాలకు కట్టాల్సిన లక్షల రూపాయలు ఓపెన్ స్పేస్ టాక్స్ ఎగ్గొట్టినా జీవీఎంసీ రెవెన్యూ అధికారులు పట్టించుకోలేదన్నారు. అక్రమ భవన నిర్మాణం చేపడుతున్న భవన యజమానిపై చర్యలు తీసుకోవాలని కోరారు.

దిలీప్ కుమార్‌కు ఘన స్వాగతం

ప్రజాశక్తి- అనకాపల్లి

ఆంధ్రప్రదేశ్ ఇన్ ల్యాండ్ వాటర్ వేస్ అథారిటీ ఛైర్మన్‌గా నియమితులై సోమవారం అనకాపల్లి వచ్చిన వైసిపి రాష్ట్ర కార్యదర్శి దంతులూరి దిలీప్ కుమార్‌కు ఆ పార్టీ నాయకులు, కార్యకర్తలు, అనుచరులు ఘనంగా స్వాగతం పలికారు. అనకాపల్లి రైల్వేస్టేషన్ నుండి ర్యాలీగా పార్టీ కార్యాలయానికి తీసుకువచ్చారు. అక్కడ రాష్ట్ర మంత్రి గుడివాడ అమర్నాథ్, దంతులూరి దిలీప్ కుమార్ పరస్పరం సత్కరించుకున్నారు. అనంతరం ఓపెన్ టాప్ జీప్ మీద దిలీప్ కుమార్, మంత్రి అమర్నాథ్, వైసిపి జిల్లా అధ్యక్షులు బొడ్డేడ ప్రసాద్, ఎంపీపీ గొర్లి సూరిబాబు తదితరులు పట్టణంలోని ప్రధాన మార్గాలగుండా ఊరేగింపుగా వెళ్లారు. దారి పొడవునా అభిమానులు పూలమాలలు, గజమాలతో సత్కరించారు. విచిత్ర వేషధారణలు, బైక్ ర్యాలీలతో వైసిపి అభిమానులు హోరెత్తించారు. ఈ కార్యక్రమంలో పార్టీ నాయకులు కొణతాల మురళీకృష్ణ, దంతులూరి శ్రీధర్‌రాజు, జాజుల రమేష్, సూరిశెట్టి రమణ అప్పారావు, కలగా గున్నయ్య నాయుడు, మల్ల బుల్లిబాబు, డాక్టర్ రామ్మూర్తి, వైసిపి ఎంపీటీసీలు, సర్పంచులు, నాయకులు పాల్గొన్నారు.



దిలీప్ కుమార్, అమర్‌నాథ్‌కు గజమాల వేస్తున్న దృశ్యం

ఎగుమతుల్లో దూసుకుపోతున్న వి -సెజ్

ఈ ఆర్థిక సంవత్సరం త్రైమాసికంలో గణనీయ ప్రగతి

ప్రజాశక్తి గ్రేటర్ విశాఖ బ్యూరో

వి-సెజ్ 2023-24 ఆర్థిక సంవత్సరంలో ఏప్రిల్ - జూన్ మధ్య రూ.50,195 కోట్ల ఎగుమతులను నమోదు చేసిందని విశాఖపట్నం స్పెషల్ ఎకనామిక్ జోన్ జోనల్ డెవలప్‌మెంట్ కమిషనర్ శ్రీనివాస్ ముప్పాల సోమవారం ఒక ప్రకటనలో వెల్లడించారు. 2022-23 పరిస్థితి కంటే 34 శాతం పెరుగుదల ఉందని తెలిపారు. అందులో సేవల ఎగుమతులు రూ.35,992 కోట్లు కాగా, సరుకుల ఎగుమతులు రూ.14,203 కోట్లు అని పేర్కొన్నారు. సేవల ఎగుమతులు 36 శాతం పెరిగాయన్నారు. అదే సమయంలో సరుకుల ఎగుమతులు మునుపటి సంవత్సరంతో పోలిస్తే 28 శాతం పెరిగినట్లు వెల్లడించారు. మొత్తంగా విసెజ్ రూ.1,04,961 కోట్ల పెట్టుబడులను ఆకర్షించి, .2023 జూన్ 30 నాటికి 6,61,579 మందికి ఉపాధిందిచేశీఅవగని కల్పించిందని తెలిపారు. తెలంగాణ, ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాల్లోని సెజ్‌లలో యూనిట్ల ఏర్పాటుకు త్రైమాసికంలో 12 కొత్త



కమిషనర్ ఎం.శ్రీనివాస్

ప్రతిపాదనలకు ఆమోదం లభించిందని ఆయన తెలియజేశారు. ఈ యూనిట్లు రూ.1,956 కోట్ల పెట్టుబడులు పెట్టి 2943 మందికి ఉపాధిని కల్పిస్తాయని పేర్కొన్నారు. రాష్ట్రంలో మూడు తయారీ యూనిట్లకు ఆమోదం లభించిందని, వీటిలో అద్వైత్ బయోఫ్యూయల్స్ ప్రైవేట్ లిమిటెడ్, బయోకాన్ లిమిటెడ్, గ్రనులేట్స్ సిజెడ్ఆర్ఒ ప్రైవేట్ ఫార్మాస్యూటికల్ ఉన్నాయని పేర్కొన్నారు. తెలంగాణలో తొమ్మిది యూనిట్లకు ఆమోదం లభించిందని తెలుపుతూ వాటి వివరాలు వెల్లడించారు. త్రైమాసికం సందర్భంగా సెజ్‌లో ప్రపంచ పర్యావరణ దినోత్సవాన్ని పురస్కరించుకుని పెద్దఎత్తున మొక్కలు నాటినట్లు చెప్పారు. ఇటీవల అంతర్జాతీయ యోగా దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించామన్నారు. ప్రగతి దిశలో సాగుతున్న వి సెజ్‌కు సహకారం అందిస్తున్న అందరికీ కృతజ్ఞతలు తెలిపారు.

బస్సు ప్రమాద బాధితుల ఆరోగ్యంపై ఆరా

ప్రజాశక్తి - విశాఖ కలెక్టరేట్ : పాడేరు ఘాట్‌లో వ్యూ పాయింట్ వద్ద ఆదివారం జరిగిన బస్సు ప్రమాదంలో గాయపడి విశాఖ నగరంలోని మెడికవర్ హాస్పిటల్‌లో చికిత్స పొందుతున్న వారిని జిల్లా పరిషత్ ఛైర్‌పర్సన్ జల్లిపల్లి సుభద్ర సోమవారం పరామర్శించి, ఆరోగ్య పరిస్థితిపై ఆరా తీశారు. ముంచంగిపుట్టు మండలం సరియాపుట్టు గ్రామానికి చెందిన కిల్లో బోడిరాజు, అనకాపల్లి జిల్లా నాతవరం మండలానికి చెందిన మరో క్షతగాత్ర కుటుంబం ఈ హాస్పిటల్‌లో చికిత్స పొందుతున్న విషయం తెలిసిందే. వారికి మెరుగైన చికిత్స అందించాలని సుభద్ర వైద్యులకు సూచించారు. అనంతరం ఆమె మీడియాతో మాట్లాడుతూ ప్రమాదంలో తీవ్రంగా గాయపడిన వారిని మెరుగైన చికిత్స కోసం మెడికేర్ హాస్పిటల్‌లో చేర్పామన్నారు. వీరి ఆరోగ్య పరిస్థితిని వైద్యులు నిరంతరం పర్యవేక్షిస్తున్నారని తెలిపారు. వీరందరికీ ప్రభుత్వం అండగా ఉంటుందని చెప్పారు.

దేవరాపల్లికి బస్సులు పెంచాలి : సిపిఎం

ప్రజాశక్తి-దేవరాపల్లి : మండల కేంద్రానికి మరిన్ని బస్సు సర్వీసులు పెంచాలని సిపిఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు డి వెంకన్న సోమవారం ఒక ప్రకటనలో విజ్ఞప్తి చేశారు. అనకాపల్లి జిల్లా కలెక్టర్ ఆఫీసు, చోడవరం, ఎస్.కోట, విజయనగరం ప్రాంతాలకు బస్సు సౌకర్యం లేక ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని తెలిపారు. గతంలో చోడవరం రెండు ప్రైవేటు బస్సులు ఉండేవని, అవి కూడా చాలకాలం నుండి నడవకపోవడంతో ప్రజలు నానా అవస్థలు పడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ఎస్.కోటకు బస్సు వేయడం వల్ల దేవరాపల్లిని ఆనుకొని ఉన్న అనంతగిరి మండలంలోని గిరిజన గ్రామాల ప్రజలకు ఎంతో ఉపయోగకరంగా ఉంటాయని తెలిపారు. అనకాపల్లి జిల్లా కలెక్టర్ కార్యాలయానికి ప్రజల ప్రయాణం పెరుగుతుందని, దానిని దృష్టిలో పెట్టుకొని బస్సులు నడపాలని కోరారు. దీనిపై ప్రజా ప్రతినిధులు దృష్టి సారించాలని విజ్ఞప్తి చేశారు.

చోడవరంలో మోస్తరు వర్షం

ప్రజాశక్తి-చోడవరం : చోడవరంలో సోమవారం ఓ మోస్తరు వర్షం కురిసింది. పట్టణంలో రోడ్లు జలమయమయ్యాయి. సుమారు నెలరోజులుగా వర్షాలు కురవకపోవడంతో వరి నారుమల్లు వేసుకున్న రైతులు ఆవేదనకు గురయ్యారు. ప్రస్తుతం కురిసిన వాన వరి నాట్లు వేసుకునే రైతులకు, చెరుకు తోటలకు ఊపిరి పోసిందని చెప్పవచ్చు. ఇలాగే వర్షం పడితే మెట్ట పొలాల్లో వరి నాట్లు పడే అవకాశం ఉందని రైతులు అంటున్నారు.

జల్ జీవన్ మిషన్ పనులు ప్రారంభం

ప్రజాశక్తి-బుచ్చయ్యపేట : మండలంలోని రాజాం గ్రామంలో జల్ జీవన మిషన్ పథకం కింద ఇంటింటికి తాగు నీటి కుళాయిల ఏర్పాటు పనులను ప్రభుత్వ విప్, స్థానిక ఎమ్మెల్యే కరణం ధర్మశ్రీ సోమవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఒక్క రాజాం గ్రామంలోనే 1 కోటి 23 లక్షల రూపాయలతో గ్రామ ప్రజలకు ప్రతి ఇంటికీ కుళాయిలు ఏర్పాటు చేస్తున్నట్లు చెప్పారు. కార్యక్రమంలో స్థానిక సర్పంచ్ మరిశా నాని, ఎంపీపీ దాకవరపు నాగేశ్వర దేవి నాగరాజు, వైస్ ఎంపీపీ గొంప చినబాబు, వైసిపి మండల అధ్యక్షులు కొల్లిమల్ల అచ్చంనాయుడు, మండల జెసిఎస్ కన్వీనర్ కోరుకొండ అప్పలనాయుడు, పలువురు నాయకులు పాల్గొన్నారు.



కొబ్బరి కాయకొట్టి పనులను ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే ధర్మశ్రీ



ప్లకార్డులతో నిరసన తెలుపుతున్న ఎస్ఎస్ఎ ఉద్యోగులు

రెగ్యులర్ చేయాలని ఎస్ఎస్ఎ ఉద్యోగుల నిరసన

ప్రజాశక్తి- బుచ్చయ్యపేట : సర్వ శిక్ష అభియాన్‌లో కాంట్రాక్టు ఔట్సోర్సింగ్ విధానంలో పనిచేస్తున్న ఉద్యోగులను రెగ్యులర్ చేయాలని కోరుతూ సోమవారం స్థానిక మండల విద్యాశాఖ కార్యాలయం వద్ద నిరసన తెలిపారు. ఉద్యోగులందరినీ రెగ్యులర్ చేయాలని, ఎంటిఎస్ విధానంలో వేతనాలను పెంచాలని, బకాయి పడిన వేతనాలను వెంటనే చెల్లించాలని నినాదాలు చేశారు. అనంతరం ఎంఇఒకు వినతి పత్రాన్ని అందజేశారు. కార్యక్రమంలో సిఆర్పి శ్రీను, పూలరాజు, ఎస్ రమణ పాల్గొన్నారు.

దేవరాపల్లి : మండలం విద్యాశాఖలో పనిచేస్తున్న సమగ్ర శిక్ష ఉద్యోగులు సోమవారం మధ్యాహ్నం భోజన విరామ సమయంలో నిరసన కార్యక్రమాన్ని చేపట్టారు. సమగ్ర శిక్షలో పనిచేస్తున్న అన్ని విభాగాల ఉద్యోగులకు జూలై నెల జీతాలు వెంటనే విడుదల చేయాలని, ఎంటిఎస్ అమలు చేసి వేతనాలు పెంచాలని కోరారు.

జూపూడి దళిత ద్రోహి : నాగజగదీష్


ప్రజాశక్తి-అనకాపల్లి : ఎస్సీల ప్రయోజనాలు కాపాడలేని జూపూడి ప్రభాకర్ ఊసరవెల్లి కంటే ప్రమాదకరమైన వ్యక్తి అని, జూపూడి దళిత ద్రోహి అని టిడిపి జిల్లా అధ్యక్షులు బుద్ద నాగ జగదీశ్వరరావు విమర్శించారు. స్థానిక టిడిపి పార్లమెంటరీ పార్టీ కార్యాలయంలో సోమవారం విలేకరుల సమావేశంలో నాగజగదీష్ మాట్లాడుతూ నాలుగున్నరేళ్ల వైసిపి ప్రభుత్వంలో ఎస్‌సిలపై ఆరువేలకు పైగా దాడులు జరిగినా ఒక్కరోజు కూడా జూపూడి నోరు విప్పలేదన్నారు. ప్రభుత్వాలు మారిన వెంటనే పార్టీలు ఫిరాయించి సొంత ప్రయోజనాల కాపాడుకోవడం కోసమే పని చేస్తున్నారని విరుచుకుపడ్డారు. పదవుల కోసం జగన్ రెడ్డికి పాదపూజ చేయండి కాని, ప్రతిపక్షాలపై నోరు జారితే చూస్తూ ఊరుకునేది లేదని హెచ్చరించారు. కార్యక్రమంలో టిడిపి ఎస్సీ సెల్ నాయకులు సబ్బవరపు గణేష్, ఎలకా మల్లి బాబు, చవ్వేటి అప్పలరాజు, మైలపల్లి పోతురాజు పాల్గొన్నారు.

రోగులకు పండ్లు, పాలు, రొట్టెల పంపిణీ

ప్రజాశక్తి -అనకాపల్లి : సోదర సంక్షేమ సమితి వ్యవస్థాపకులు కొణతాల పూర్ణచంద్రరావు, కళావతి దంపతుల షష్టిపూర్తి సందర్భంగా సోమవారం అనకాపల్లి ఎన్టీఆర్ జిల్లా హాస్పిటల్లో రోగులకు రొట్టెలు, బిస్కెట్స్, పండ్లు, పాలు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో డాక్టర్ లక్ష్మణ, సమితి అధ్యక్షులు దాసు బాబ్జి, శ్రీనివాసరావు, ఎల్లపు వెంకటరమణ, కొణతాల పూర్ణచంద్రరావు, పీలా రాముడు, కేఎన్‌వి సత్యనారాయణ, కర్రి శివుడు, పీవీ జగన్ మోహన్ రావు, కేయం నాయుడు పాల్గొన్నారు.

సాయిబాబా ఆలయ వార్షికోత్సవానికి గంటాకు ఆహ్వానం

ప్రజాశక్తి- కశింకోట : మండలం పల్లపు సోమవారం గ్రామంలో ఈ నెల 25న శుక్రవారం తెలుగు రైతు రాష్ట్ర కార్యదర్శి, గ్రామ మాజీ సర్పంచ్ గొంతిని శ్రీనివాసరావు ఆధ్వర్యంలో జరుగు సాయిబాబా ఆలయ పదకొండవ వార్షికోత్సవానికి హాజరు కావాలని విశాఖ ఉత్తర ఎమ్మెల్యే, మాజీ మంత్రి గంటా శ్రీనివాసరావుకు ఆహ్వానం అందించారు. ఈ మేరకు గంటా శ్రీనివాసరావును అనకాపల్లి మాజీ ఎమ్మెల్యే పీలా గోవింద సత్యనారాయణ ఆధ్వర్యాన సోమవారం మర్యాద పూర్వంగా కలిశారు. కార్యక్రమంలో సిద్దిరెడ్డి శ్రీనివాసరావు, గూడుపు ప్రకాష్, కర్రి దుర్గనాయుడు, జెర్రిపోతుల నూకునాయుడు, నారపల్లి ప్రసాద్ పాల్గొన్నారు.



మాజీ మంత్రి గంటాను కలిసిన పీలా గోవింద్, గొంతిన శ్రీనివాసరావు

తీవ్ర వర్షాభావం

- ఆగస్టులో సాధారణ వర్షపాతానికి 85.4 శాతం తక్కువ
- మూడో వంతు కూడా పడని వరి నాట్లు

ప్రజాశక్తి - యలమంచిలి

జిల్లాలో తీవ్ర వర్షాభావ పరిస్థితులు నెలకొన్నాయి. దీంతో ఆగస్టు మూడో వారం గడుస్తున్నా మూడో వంతు కూడా వరినాట్లు పడలేదు. వరి పంటకు అతి ముఖ్యమైన ఆగస్టు నెలలో వర్షపాతం ఈ నెల 1వ తేదీ నుండి 21 వరకు పరిశీలిస్తే... యలమంచిలి డివిజన్‌లో సాధారణ వర్షపాతం 98.8 మిల్లీమీటర్లు కాగా, కేవలం 13.4 మిల్లీమీటర్లు మాత్రమే వర్షం కురిసిందని తహశీల్దార్ కార్యాలయంలోని రికార్డులు చెబుతున్నాయి. అంటే 85.4 మిల్లీమీటర్ల వర్ష పాతం తక్కువగా ఉంది. గతేడాది ఇదే సమయంలో 92.7 మిల్లీలీటర్లు వర్షం కురిసింది. వర్షాలు పడకపోవడంతో వరినాట్లు వేయడానికి సాగునీరు లేక రైతులు ఆకాశం వైపు బిత్తర చూపులు చూస్తున్నారు.



వ్యవసాయశాఖ ఎడి రవి ప్రకాష్

యలమంచిలి వ్యవసాయ శాఖ డివిజన్ పరిధి ఎస్.రాయవరం, యలమంచిలి, రాంబిల్లి, అచ్యుతాపురం నాలుగు మండలాల్లో 23 వేల ఎకరాల్లో వరి పంట సాగు చేయాల్సి ఉండగా ఇప్పటి వరకు కేవలం 7 వేల ఎకరాల్లో మాత్రమే నాట్లు పడ్డాయని యలమంచిలి వ్యవసాయశాఖ ఎడి రవిప్రకాష్ తెలిపారు. నాట్లు వేసిన వరి పొలాలకు సరిపోయే నీరు రాక అవి కూడా ఎండిపోయే పరిస్థితి దాపురించిందని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఈ నాలుగు మండలాల్లోని వరి పొలాలు శారద, మైనర్ శారద, వరాహ నదుల గుండా ప్రవహించే వర్షం నీటిపై ఆధారపడి ఉన్నాయి. ముందస్తు వర్షాల మూలంగా రైవాడ ఆయకట్టు నీరు శారద నదిలో కాస్త పారుతుండడంతో ఆలస్యంగానైనా వరి నాట్లు మొదలు పెట్టారు. క్రమంగా వర్షాలు మందగించడంతో నీటి ఎద్దడి ఎదురైంది. ఎండలు దంచి కాస్తుండడంతో వరి రైతు ఆశలు ఆవిరై పోతున్నాయి. వరి నారు కాపాడుకోవడానికి ఇబ్బందికరమైన పరిస్థితి ఎదురైంది. వరి ఊడ్పులు మొదలయ్యాక పూర్తిగా వర్షాలు పడకేయడంతో కరువు పరిస్థితులు ఏర్పడ్డాయి. ఇలాంటి కరువు పరిస్థితులను ఎదుర్కోవడానికి ప్రభుత్వ ఎటువంటి చర్యలు చేపడుతుందో వేచి చూడాలి.

వర్షాభావ పరిస్థితుల్లో రైతులను ఆదుకోవాలి

నర్సీపట్నం కేంద్రంగా ఐటిడిఎ ఏర్పాటుకు సిపిఎం డిమాండ్

ప్రజాశక్తి- అనకాపల్లి

జిల్లాలో వర్షాభావ పరిస్థితులు నెలకొన్నందున కంటింజెన్సీయాక్షన్ ప్లాన్ తయారు చేసి రైతులను ఆదుకోవాలని సిపిఎం జిల్లా కె.లోకనాథం సోమవారం ఒక ప్రకటనలో డిమాండ్ చేశారు. జిల్లాలో పోలవరం ఎడమ కాలువ, ఉత్తరాంధ్ర సుజల స్రవంతి, సాగునీటి ప్రాజెక్టులను పూర్తి చేయకపోవడం వల్ల జిల్లా ప్రజలు కరువుకాటాలకు గురౌతున్నారని ఆందోళన వ్యక్తం చేశారు. నాన్‌షెడ్యూల్ గిరిజనులకు నర్సీపట్నం కేంద్రంగా ఐటిడిఎ ఏర్పాటు చేయాలని, ఇందుకు పార్టీలకు అతీతంగా జిల్లా పరిషత్ సమావేశంలో తీర్మానం చేసి ప్రభుత్వానికి పంపాలని విజ్ఞప్తి చేశారు. కోటవురట్ల మండలం గొట్టివాడ పంచాయితీ అణుకు గిరిజనులు రహదారి నిర్మాణం, మౌళిక సదుపాయాలు, ఇల్లు, ఆశ కార్యకర్త నియామకం వంటి పలు సమస్యలపై జులై 7 నుండి రిలే నిరాహార దీక్షలు చేపడుతున్నా ప్రభుత్వ స్పందించకపోవడం అన్యాయమన్నారు. జిల్లా పరిషత్ సమావేశంలో పార్టీలకు అతీతంగా జిల్లా అభివృద్ధిపై చర్చించాలని కోరారు. ఉత్తరాంధ్ర సుజల స్రవంతి, పోలవరం ఎడమ కాలువ పనులు పూర్తి చేసేందుకు అవసరమైన నిధులు ప్రభుత్వం మంజూరు చేసేలా సభ్యులంతా ఏకోన్ముకంగా ప్రభుత్వంపై ఒత్తిడి తీసుకురావాలని విజ్ఞప్తి చేశారు. ఏజన్సీలో పిటిజిలకు, అణుకు పిటిజిలకు అంత్యోదయ కార్డులు మంజూరు చేసేలా సమావేశం చొరవ తీసుకోవాలని లోకనాథం డిమాండ్ చేశారు.

కుమారస్వామికి సన్మానం

ప్రజాశక్తి - బుచ్చయ్యపేట : బుచ్చయ్యపేట పోలీస్ స్టేషన్లో ఎస్ఐగా విధులు నిర్వహిస్తూ సిఐగా ఉద్యోగోన్నతి పొందిన కె.కుమారస్వామిని కొత్తకోట సిఐ సయ్యద్ ఇలియాజ్ మహమ్మద్ ఆధ్వర్యంలో ఆదివారం సాయంత్రం స్థానిక పోలీస్ స్టేషన్‌లో సన్మానించారు. తనకు సహాయ సహకారాలు అందించిన సిబ్బందికి ఈ సందర్భంగా కుమారస్వామి అభినందించారు. కార్యక్రమంలో ఎస్ఐ సుంకర సత్యనారాయణ, స్థానిక పోలీస్ స్టేషన్ సిబ్బంది అర్జున్, కిరణ్, పైడిరాజు, శివ, సత్యనారాయణ, శ్రీను, జ్యోతి పాల్గొన్నారు.

ఐక్యవేదికలో భాగస్వామ్యం కావాలి

ప్రజాశక్తి-దేవరాపల్లి : సమాజాభివృద్ధికి, సమగ్రాభివృద్ధికి దోహదపడేందుకు ప్రతి ఒక్కరూ బాధ్యతగా ఐక్యవేదికలో భాగస్వామ్యం కావాలని ప్రజాస్వామ్య పరిరక్షణ ఐక్యవేదిక రాష్ట్ర ఇన్‌ఛార్జి ప్రధాన కార్యదర్శి కొత్తరపు ప్రసాద్ అన్నారు. దేవరాపల్లి మండల ఐక్యవేదిక సర్వసభ్య సమావేశం స్థానిక రైవాడ అతిథి గృహం వద్ద సోమవారం జరిగింది. జిల్లా అధ్యక్షులు కె.వి.రమణ అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో ప్రసాద్ మాట్లాడుతూ క్రమశిక్షణతో కూడిన నియమాలతో సంస్థ పనిచేస్తుందన్నారు. ఈ కార్యక్రమంలో ఆదిరెడ్డి చిన కన్నాబాబు, పారేపల్లి సత్యనారాయణ, జిలాని, వెంకటరావు పాల్గొన్నారు.

31న మరిడిమాంబ ఉత్సవం

ప్రజాశక్తి-అనకాపల్లి : పట్టణంలో కోట్నీవీధిలో వెలిసిన శ్రీమరిడిమాంబ అమ్మవారి పండుగ మహోత్సవంకు చెందిన వాల్ పోస్టర్‌ను సోమవారం మంత్రి గుడివాడ అమర్‌నాథ్ తన క్యాంపు కార్యాలయంలో ఆవిష్కరించారు. ఆలయ నూతన ఛైర్మన్‌గా కోట్నీ శ్రీనివాసరావు, ధర్మకర్తలుగా అలం ప్రసాద్, కోరుకొండ వాసు, సీతా నూకరాజు, కోటయార్ నాగరాజు, లక్కిడిప్ స్వప్న, నియమితులు కాగా, వారిని మంత్రి అభినందించారు. కార్యక్రమంలో ఆసుపత్రి అభివృద్ధి కమిటీ సభ్యులు డాక్టర్ రామ్మూర్తి, ఏవి రత్నకుమార్, మళ్ల బుల్లిబాబు, గొల్లవిల్లి శ్రీనివాసరావు, సూరిశెట్టి రమణ అప్పారావు, కోరుకొండ రాఘవ, అప్పికొండ రవిశంకర్, కేతిరెడ్డి ప్రసాద్ పాల్గొన్నారు.

మున్సిపల్ కార్మికుల అరెస్టు సరికాదు

ప్రజాశక్తి-అనకాపల్లి : అపరిష్కృత సమస్యల పరిష్కారానికి ఈ నెల 22న విజయవాడలో ధర్నాకు బయలుదేరిన ఏఐటియుసి నాయకులు, మున్సిపల్ వర్కర్లను ఎక్కడికక్కడ అరెస్టు చేయడం, గృహ నిర్బంధం చేయడం దుర్మార్గమని ఏఐటియుసి జిల్లా కన్వీనర్ వైఎన్.భద్రం ఆగ్రహం వ్యక్తం చేశారు. సోమవారం ఆయన స్థానిక విలేకర్లతో మాట్లాడుతూ తాము అధికారంలోకి వస్తే కాంట్రాక్ట్ మున్సిపల్ కార్మికులను పర్మినెంట్ చేస్తానని, ఆరోగ్య బీమా, ఇతర సదుపాయాలు కల్పిస్తానని ఇచ్చిన హామీలను జగన్ వాటిని నెరవేర్చలేదన్నారు. న్యాయం చేయాలని కోరితే అరెస్టులకు పూనుకోవడం దుర్మార్గమన్నారు.

నేడు ఎం.అలమండలో ఉచిత కంటి వైద్య శిబిరం

ప్రజాశక్తి-దేవరాపల్లి : మండలంలోని ఎం అలమండ గ్రామంలో మంగళవారం డాక్టర్ వైయస్సార్ కంటి వెలుగు పథకం ద్వారా శంకర్ ఫౌండేషన్ కంటి ఆసుపత్రి వారిచే ఉచిత మెగా కంటి వైద్య శిబిరం నిర్వహిస్తున్నట్లు క్యాంప్ అసిస్టెంట్ మేనేజర్ ఎం.అరుణ్ కుమార్ సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. పాల కేంద్రం వద్ద ఉదయం 8 గంటల నుండి మధ్యాహ్నం రెండు గంటల ఈ వైద్య శిబిరం జరుగుతుందని, అన్ని కంటి వ్యాధులకు ఉచితంగా కంటి వైద్య పరీక్షలు నిర్వహిస్తామని పేర్కొన్నారు. కంటి వైద్య పరీక్షలు వచ్చిన వారు తమ ఆధార్ కార్డు, ఆరోగ్యశ్రీ కార్డు, బ్యాంక్ అకౌంట్ పాస్ బుక్, ఫోన్ నెంబరు తప్పనిసరిగా తీసుకొని రావాలని కోరారు.

ప్రజలు గర్వపడేలా రాష్ట్ర పాలన

ప్రజాశక్తి - కలెక్టరేట్ : రాష్ట్రంలో ముఖ్యమంత్రి వైఎస్.జగన్మోహన్ రెడ్డి అమలు చేస్తున్న పథకాలను ఇతర రాష్ట్రాలు కూడా ఆదర్శంగా తీసుకుంటున్నాయని సిఆర్ మీడియా అకాడమీ ఆఫ్ ఎపి ఛైర్మన్ కొమ్మినేని శ్రీనివాసరావు అన్నారు. సోమవారం అవర్ స్టేట్ అవర్ లీడర్‌లో భాగంగా 'సుపరిపాలన దిశగా ఆంధ్రప్రదేశ్ రూపాంతరం' అనే అంశంపై జిల్లా పరిషత్ సమావేశ మందిరంలో వైఎస్ఆర్ ఇంటలెక్చువల్ ఫోరం ఆధ్వర్యంలో సదస్సు జరిగింది. ముఖ్యఅతిథిగా హాజరైన ఆయన ఈ సందర్భంగా మాట్లాడుతూ ప్రజల వద్దకు సంక్షేమ ఫలాలను తీసుకెళ్లే లక్ష్యంతో ప్రవేశపెట్టిన సచివాలయ వ్యవస్థను తమిళనాడు ప్రభుత్వం కూడా అమలు చేసేందుకు సిద్ధమైందన్నారు. వాలంటీర్ల వ్యవస్థను మెచ్చుకున్న కేరళ ప్రభుత్వం ఆ రాష్ట్రంలో ఇలాంటి వ్యవస్థనే తీసుకొచ్చేందుకు చర్యలు చేపడుతోందన్నారు. గ్రామ సచివాలయ వ్యవస్థలో భాగంగా రాష్ట్ర వ్యాప్తంగా గ్రామ పంచాయతీల్లో 50 వేల కార్యాలయాలను ఏర్పాటు చేసి సిఎం జగన్ అభివృద్ధికి పాటుపడ్డారన్నారు. కార్యక్రమంలో డాక్టర్ వైఎస్ఆర్ ఇంటలెక్చువల్ ఫోరం రాష్ట్ర అధ్యక్షులు శాంత మూర్తి, నాగార్జున యూనివర్సిటీ రిటైర్డ్ విసి వి.బాలమోహన్ దాస్, ఎపి ఇన్నోవేషన్ సొసైటీ జాయింట్ డైరెక్టర్ లావణ్య పాల్గొన్నారు.

కన్న పిల్లల్ని హత్య చేసిన కేసులో

ముద్దాయికి జీవిత ఖైదు

ప్రజాశక్తి- అనకాపల్లి



ముద్దాయి సత్తిబాబు

కన్న పిల్లల్ని హత్య చేసిన కేసులో ముద్దాయికి జీవితకాలం కఠిన కారాగార శిక్ష, రూ.2000 జరిమానా, అది చెల్లించని పక్షంలో మరో రెండు నెలల ఖైదీ విధిస్తూ విశాఖ 12వ ఎడిజె కోర్టు సోమవారం తీర్పునిచ్చింది. ఈ వివరాలను ఎస్పీ మురళీకృష్ణ ఒక ప్రకటనలో తెలియజేశారు. ఎస్పి కథనం ప్రకారం... జిల్లాలోని పాయకరావుపేట మండలం గాంధీ నామవరం గ్రామానికి చెందిన పాలిక సత్తిబాబు 2016 సెప్టెంబర్ 9న భార్యతో గొడవపడి, తమ ఇద్దరు పిల్లలు హనీ, కార్తీక్ తన పిల్లలు కారని అక్రమ సంబంధం అంటగట్టి పిల్లల్ని దుష్టబుద్ధితో నోరు ముక్కు కప్పి హత మార్చాడు. దీంతో తనను కూడా చంపుతాడని భయంతో భార్య బయటకు పరుగులు తీసి పోలీసులకు ఫిర్యాదు చేసింది. కేసును విచారించిన కోర్టుపై తీర్పును వెలువరించిందని ఎస్పీ మురళీకృష్ణ తెలిపారు. దర్యాప్తు అధికారి ఇన్‌స్పెక్టర్ కె.వెంకట్రావును, వాదనలు వినిపించిన అడిషనల్ పిపి వి.దేవానందరావును జిల్లా ఎస్పీ కె.వి.మురళీకృష్ణ అభినందించారు.

24న 'గొన్నా'లో మెగా ఉద్యోగ మేళా

ప్రజాశక్తి-పరవాడ : గొన్నా విద్యాసంస్థ వ్యవస్థాపకుడు కీర్తిశేషులు జిడి.నాయుడు 48వ జయంతి సందర్భంగా మెగా జాబ్ మేళాను ఈనెల 24న గురువారం మండలంలోని గొన్నా ఇంజనీరింగ్ కళాశాలలో నిర్వహిస్తున్నట్లు కళాశాల జనరల్ సెక్రటరీ గొన్నా హేమచంద్ నాయుడు సోమవారం ఒక పత్రిక ప్రకటనలో తెలిపారు. ఈ జాబ్ మేళాలో అపోలో ఫార్మసీ, డెక్కన్ కెమికల్స్, ముత్తూట్ ఫైనాన్స్, జియో ఫైబర్, యాకోహోమా, ఐసిఐసిఐ, వరుణ్ మోటర్, జయభేరి ఆటోమొబైల్స్, పవర్ రివేన్స్, హనీ గ్రూప్స్, ఎస్సార్ కంట్రోల్ అండ్ ఆటోమొబైల్స్, టాటా స్టీవ్, తేజ ఇండియా ప్రైవేట్ లిమిటెడ్ తదితర 13 కంపెనీలు పాల్గొంటున్నాయని, ఆసక్తి గల నిరుద్యోగ యువతీ యువకులు జాబ్ మేళా ఇంటర్వ్యూలకు హాజరు కావాలని కోరారు. ఎస్ఎస్‌సి, ఇంటర్, డిప్లమా, బిటెక్, ఎంటెక్, ఎంబీఏ, ఏదైనా పిజి డిగ్రీ విద్యార్థులు అర్హులని, 18-35 సంవత్సరాల మధ్య వయస్సు ఉండాలని సూచించారు. పూర్తి వివరాలు కోసం 9642829352, 9885784543 నెంబర్లను సంప్రదించాలని కోరారు.

విద్యార్థులకు బ్యాగులు, కిట్లు పంపిణీ

ప్రజాశక్తి- అనకాపల్లి : మండలంలోని దిబ్బపాలెం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల 3, 4, 5 తరగతుల విద్యార్థులకు గ్రామ సర్పంచ్ పీలా ఉష అప్పారావు ఆధ్వర్యంలో నాంది ఫౌండేషన్ సహకారంతో సోమవారం బ్యాగ్లు, కిట్లు పంపిణీ చేశారు. కార్యక్రమంలో స్కూల్ ఛైర్మన్ కాండ్రేగుల భాస్కర్, మట్ట గణేష్, నాంది ఫౌండేషన్ స్టాఫ్ పీలా సౌజన్య పాల్గొన్నారు.

విజేతలకు బహుమతుల ప్రదానం

ప్రజాశక్తి - యలమంచిలి : చెన్నైకి చెందిన శ్రీదర్శిని కలైకూడమ్ ఫైన్ ఆర్ట్స్‌వారు యలమంచిలి కొత్తపేట హైస్కూల్లో ఆగస్టు 13న జాతీయ యువజనోత్సవాల సందర్భంగా నిర్వహించిన డ్రాయింగ్ పోటీల్లో విజేతలైన విద్యార్థులకు సోమవారం బహుమతులు, సర్టిఫికెట్లు అందజేశారు. ఈ కార్యక్రమంలో పాఠశాల హెచ్ఎం వై.వెంకటరమణ, డ్రాయింగ్ టీచర్ సిహెచ్.రాజేశ్వరి పాల్గొన్నారు.


మాట్లాడుతున్న వికలాంగులు

వికలాంగుల సమస్యలపై వినతి

ప్రజాశక్తి-నర్సీపట్నంటౌన్:వికలాంగుల సమస్యలను పరిష్కరించాలని సోమవారం స్థానిక రెవెన్యూ డివిజనల్ కార్యాలయంలో నిర్వహించిన స్పందనలో స్థానిక వికలాంగ సంక్షేమ సంఘం నేతలు వినతి పత్రాన్ని అందించారు. ఈ సందర్భంగా వికలాంగ సంక్షేమ సంఘం సభ్యులు మాట్లాడుతూ, పెరిగిన ధరల నేపథ్యంలో జీవనోపాధి కష్టంగా మారిందని, పింఛను రూ.6000లకు పెంచాలని కోరారు. ఈ విషయాన్ని ముఖ్యమంత్రి వైయస్ జగన్మోహన్ రెడ్డి దృష్టికి తీసుకెళ్లాలని కోరారు. రూ.3,000 పింఛనుతోటే కుటుంబాన్ని నెట్టుకు రావడం చాలా కష్టం అవుతుందని తెలిపారు. వికలాంగ సంక్షేమ సంఘానికి ప్రభుత్వ స్థలం ఇప్పించాలని కోరారు.


పరీక్షలు చేస్తున్న వైద్యులు

పశువైద్య శిబిరం

ప్రజాశక్తి-రోలుగుంట:మండలంలోని కొండపాలెం సచివాలయ పరిధి వెలంకాయలపాలెంలో పశువులకు శాస్త్రీయ పోషణపై అవగాహన సోమవారం కల్పించారు. పశు వైద్యులు నూకేశ్వరరావు సంపూర్ణ మిశ్రమ దాణా ప్రాముఖ్యత తెలియజేశారు. పశు మత్స్యదర్శిని పుస్తకం గురించి వివరించారు. స్థానిక ఉప సర్పంచ్ బంటు చిరంజీవి, గ్రామ పెద్దలు, రాజునాయుడు, పెంటయ్య, పాడి రైతులు పాల్గొన్నారు. అనంతరం నిర్వహించిన శిబిరంలో పశువులకు పరీక్షలు నిర్వహించి 25 మంది రైతులకు ఉచితంగా అజీర్తి, ఎద, లివర్ టానిక్, బలవర్ధక మందులు పంపిణీ చేశారు. కొండపాలెం పశు సంవర్ధక సహాయకులు శెట్టి యశోద ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో గోపాల మిత్ర సత్తిబాబు, మహేష్, రాజు, శివ, బాలాజీ పశు వైద్య సేవలు అందించారు.

సాగు పట్టాలివ్వాలని ధర్నా


నినాదాలు చేస్తున్న దళిత రైతులు

ప్రజాశక్తి-నర్సీపట్నంటౌన్:రోలుగుంట మండలం వడ్డిప, రత్నంపేటలో సాగు చేస్తున్న పేదలు, దళితులకు డీ ఫారం పట్టాలివ్వాలని ఆయా గ్రామాల దళిత రైతులు సోమవారం ఆర్డీవో కార్యాలయం వద్ద నిరసన చేపట్టారు. పనసలపాడు రెవెన్యూ పరిధిలో దళితులు సాగు చేస్తున్న భూములకు రక్షణ కల్పించాలని ఆంధ్రప్రదేశ్ వ్యవసాయ కార్మిక సంఘం డిమాండ్ చేసింది. ఈ సందర్భంగా సిపిఎం జిల్లా కార్యవర్గ సభ్యుడు కె గోవిందరావు, కెవిపిఎస్ జిల్లా కార్యదర్శి ఈ చిరంజీవి మాట్లాడుతూ, నర్సీపట్నం డివిజన్ పరిధిలో జగనన్న రీ సర్వేలో సాగుదారులని నమోదు చేయకుండా ప్రభుత్వ భూమిగా గుర్తించారన్నారు. గిరిజనులు, దళితుల డి పట్టా భూములను రియల్ ఎస్టేట్ వ్యాపారస్తులు ఆక్రమించుకున్నారని తెలిపారు. రియల్ ఎస్టేట్ వ్యాపారస్తులు ఆక్రమించుకున్న భూములను దళితులకు, గిరిజలకు పంచాలని డిమాండ్ చేశారు.


తహశీల్దార్‌కు వినతిపత్రం అందజేస్తున్న అప్పలరాజు

నష్ట పరిహారం చెల్లించాలి

ప్రజాశక్తి-నక్కపల్లి:మండలంలోని చందనాడలో దళితుల డీ.ఫారం, గుల్ల బట్టీల భూములకు నష్టపరిహారం చెల్లించాలని ఏపీ రైతు సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి ఎం.అప్పలరాజు, పట్టాదారులు డిమాండ్ చేసారు. నష్ట పరిహారం చెల్లించాలని కోరుతూ . సోమవారం తహసీల్దార్ అంబేద్కర్‌కు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా అప్పలరాజు మాట్లాడుతూ, వైజాగ్ - చెన్నై ఇండస్ట్రీల్ కారిడార్‌కు చందనాడ దళితుల డీ.ఫారం, గుల్ల బట్టీల భూములను అధికారులు సేకరించారని తెలిపారు.పూర్తి స్థాయిలో నష్టపరిహారం చెల్లించాలని, అప్పటివరకు భూములు స్వాధీనం చేసుకోవడానికి ఎట్టి పరిస్థితుల్లోనూ కుదరదని స్పష్టం చేశారు. వీరంతా ఈ భూములపైనే ఆధారపడి జీవనం సాగి స్తున్నారన్నారు.ఈ కార్యక్రమంలో ఏడిద సన్యాసి, ఏడిద మన్నియ్య, పెదపూడి సువర్ణ రాజు, ఏడిద పోతురాజు, నాగేశ్వరరావు పాల్గొన్నారు.

శ్మశాన వాటిక స్థలం కబ్జాపై ఫిర్యాదు

ప్రజాశక్తి-చీడికాడ:శ్మశాన వాటికకు ఉపయోగిస్తున్న స్థలాన్ని కొంతమంది ఆక్రమించు కొని రీ సర్వేలో తమ పేర్లను నమోదు చేయించుకోవడం పై గిరిజనులు సోమవారం అనకాపల్లి జిల్లా కలెక్టర్‌కు ఫిర్యాదు చేశారు. ఈ సందర్భంగా గిరిజనులు మాట్లాడుతూ, సిరిజాం పంచాయతీ సిరిజం, గదబూరు గిరిజనులు పూర్వం నుండి సుమారు 40 సెంట్ల స్థలాన్ని శ్మశాన వాటికగా వినియోగిస్తున్నామన్నారు. శ్మశాన వాటిక పక్కన స్థలం ఉన్న అదే గ్రామానికి చెందిన కొందరు ఆక్రమించారన్నారు. గ్రామానికి చెందిన ఓ గిరిజనుడు మృతి చెందగా దహనం చేసేందుకు శ్మశాన వాటికకు తీసుకువెళ్లగా అక్రమ దారులు అడ్డుకున్నారన్నారు. పోలీసుల జోక్యంతో మృతదేహాన్ని ఖననం చేశామన్నారు. అధికారులకు ఫిర్యాదు చేసినా ఫలితం కన్పించలేద, దీంతో గ్రామ మాజీ సర్పంచ్ మామిడి సన్నిబాబు తో పాటు గ్రామానికి చెందిన గిరిజనులు సుమారు 70 మంది సంతకాలతో కూడిన ఫిర్యాదును స్పందనలో కలెక్టర్కు అందజేశారు.


నినాదాలు చేస్తున్న గిరిజనులు


మాట్లాడుతున్న లోచల సుజాత

బడుగు, బలహీనులకు సంక్షేమ పథకాలు

- వైసిపి ఎస్‌సి సెల్ జిల్లా అధ్యక్షురాలు సుజాత

ప్రజాశక్తి-గొలుగొండ:ముఖ్యమంత్రి వైయస్. జగన్‌మోహన్‌రెడ్డి ఎస్సీ, ఎస్టీ బడుగు వర్గాలను దృష్టిలో పెట్టుకొని సంక్షేమ పథకాల రూపకల్పన చేశారని అనకాపల్లి జిల్లా ఎస్సీ సెల్ అధ్యక్షురాలు లోచల సుజాత అన్నారు. అనకాపల్లి జిల్లా కేంద్రంలో ఐటీ శాఖ మంత్రి గుడివాడ అమర్నాథ్ క్యాంపు కార్యాలయంలో అనకాపల్లి జిల్లా వైసిపి అధ్యక్షులు బొడ్డేడ ప్రసాద్ ఆధ్వర్యంలో జిల్లా ఎస్సీ ఎల్ అధ్యక్షురాలు సుజాత అధ్యక్షతన జగనన్న ఆలోచన విధానాలు వర్ధిల్లాలి అనే కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా రాష్ట్ర ఎస్సీ సెల్ అధ్యక్షులు, ప్రభుత్వ సామాజిక న్యాయ సలహాదారులు జూపూడి ప్రభాకర్‌రావు హాజరైన ఈ కార్యక్రమంలో సుజాత మాట్లాడుతూ ముఖ్యమంత్రి వైయస్.జగన్‌మోహన్‌రెడ్డి ఎంతో దూరదృష్టితో ప్రవేశపెట్టిన నవరత్నాలు, సంక్షేమ పథకాలు 90 శాతం ఎస్సీ, ఎస్టీ, బిసి, బడుగు బలహీన వర్గాలను దృష్టిలో పెట్టుకొని రూపకల్పన చేయడమే కాకుండా ఎస్సీలకు పెద్దపీట వేశారన్నారు. ఈ కార్యక్రమంలో పార్టీ ముఖ్య నాయకులు భారీ సంఖ్యలో ప్రజలు పాల్గొన్నారు.

నవోదయతో ఉజ్వల భవిష్యత్తు

ప్రజాశక్తి -నక్కపల్లి:ఐదో తరగతిలో నవోదయ లో ప్రవేశాలు పొందిన విద్యార్థులకు ఉజ్వల భవిష్యత్ ఉంటుందని కొమ్మాది నవోదయ విద్యాలయ సిబ్బంది వెంకటేశ్వర్లు అన్నారు. మండలంలోని సోమవారం నక్కపల్లి బాలికోన్నత పాఠశాల, రాజయ్యపేట ఉన్నత పాఠశాలలతో పాటు వివిధ ప్రాథమిక పాఠశాలలను ఆయన సందర్శించారు. విద్యార్థులతో సమావేశం నిర్వహించి ఐదో తరగతిలో ప్రవేశాలపై ఉపాధ్యాయులకు, విద్యార్థులకు అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో ఎంఈఓ కె.నరేష్, ఉపాధ్యాయులు డివి సన్యాసిరావు పాల్గొన్నారు.


మాట్లాడుతున్న సిబ్బంది

రాజ్‌మా విత్తనాలు పంపిణీ చేయాలి

ప్రజాశక్తి-దుంబ్రిగుడ: రాజ్ మా విత్తనాలను సకాలంలో రైతులకు ప్రభుత్వం పంపిణీ చేయాలని స్థానిక సిపిఎం మండల నాయకులు, మాజీ సర్పంచ్ పి సురేష్ కుమార్, మాజీ ఉపసర్పంచ్ పి సత్యనారాయణ డిమాండ్ చేశారు. సోమవారం వారు స్థానిక విలేకరులతో మాట్లాడుతూ, సకాలంలో విత్తనాలు పంపిణీ చేయకపోవడంతో ఒరిస్సా, ఇతర ప్రాంతాల్లో అధిక ధరలు వెచ్చించి కొనుగోలు చేసుకుంటున్నారని చెప్పారు. సీజన్ దాటిపోతున్నా ప్రభుత్వం గిరిజనులకు ఇచ్చే సబ్సిడీ విత్తనాలు సకాలంలో అందించకుండా నిర్లక్ష్యం చేయడం సబబు కాదన్నారు. ఈ కారణంగా రైతులు నష్ట పోయే అవకాశం ఉందని చెప్పారు. రైతుల అవసరాలను ఆసరాగా చేసుకుని సంతలో దళారులు అధిక ధరలకు విక్రయాలు చేస్తున్నారని చెప్పారు. తక్షణమే ప్రభుత్వం స్పందించి సకాలంలో విత్తనాలు పంపిణీ చేయాలని డిమాండ్ చేశారు.

నర్సీపట్నంలో భవనాల తొలగింపు

ప్రజాశక్తి-నర్సీపట్నం టౌన్: రోడ్డు విస్తరణ నేపథ్యంలో ప్రైవేటు భవన యజమానులు ముందుకు వస్తున్నారు. ఈ మేరకు ఎమ్మెల్యే పెట్ల ఉమా శంకర్ గణేష్ సోమవారం భవన యజమానుల వద్దకు స్వయంగా తానే వెళ్లి మాట్లాడారు. రోడ్డు విస్తరణకు తామంతా సిద్ధమేనని యజమానులు తెలియజేశారు. మొదటి దశలో ప్రభుత్వ స్థలాల్లో ఉన్న భవనాలు తొలగించారు. రెండో దశలో ప్రైవేట్ భవనాల తొలగింపు సోమవారం ప్రారంభించారు. 100 అడుగులకు రోడ్ విస్తరణ చేయాలని ముందు నిర్ణయించారు. 80 అడుగులకు మాత్రమే అంగీకరిస్తామనీ ఒక వర్గం భవన యజమానులు పట్టుబడుతున్నారు. కొందరు కోర్టు లను ఆశ్రయించారు.105 మంది భవన యాజమానులు 90 అడుగుల మేరకు విస్తరణ చేస్తే తమకు అభ్యంతరం లేదని ముందుకు వచ్చారు. వీరి అభిప్రాయం మేరకు ఎమ్మెల్యే ఉమా శంకర్ గణేష్ 90 అడుగులకు అంగీకరించారు. ఈ నేపథ్యంలో సోమవారం రెండో దశ లో ప్రైవేట్ భవనాలు తొలగింపు ప్రక్రియ చేపట్టారు. ఈ కార్యక్రమం లో మున్సిపల్ ఛైర్మన్ సుబ్బలక్ష్మి, మాజీ ఛైర్మన్ ఆదిలక్ష్మి, వైస్ ఛైర్మన్ తమరాన అప్పలనాయుడు, మాజీ వైస్ ఛైర్మన్ గొలుసు నర్సింహమూర్తి, మున్సిపల్ సచివాలయాల కన్వీనర్ తమరాన శ్రీను, టౌన్ వైఎస్ఆర్ పార్టీ అధ్యక్షుడు ఏక శివ, అయ్యరక కార్పోరేషన్ డైరెక్టర్ కర్రి శ్రీను, ముస్లిం సంచార జాతుల డైరెక్టర్ చోటి,శిరిడీ సాయి ఆలయ నిర్వాహకులు కర్రి రాంగోపాల్, కనకదుర్గ దేవస్థానం ఛైర్మన్ దేవత అరుణ, 24 వార్డ్ ఇంఛార్జి కొణతాల వరలక్ష్మి, కౌన్సిలర్ సిరసపల్లి నాని, మాకిరెడ్డి బుల్లిదొర, యాదగిరి శేషు, బేతిరెడ్డి విజయ్, తదితరులు పాల్గొన్నారు.


భవన యజమానులతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే

పేకాట శిబిరంపై దాడి

ప్రజాశక్తి -రావికమతం:మండలంలో గొంప గ్రామ సమీపంలో పేకాట ఆడుతున్న శిబిరంపై దాడి చేసి నిందితులపై కేసు నమోదు చేసి దర్యాప్తు జరుపుతున్నట్లు ఎస్సై ఉమామహేశ్వరరావు తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, మండలంలో గొంప క్వారీకి వెళ్లే రహదారిలో కొండమెట్ట వద్ద పేకాట ఆడుతున్న శిబిరంపై తమ సిబ్బందితో దాడి చేసి ముగ్గురు వ్యక్తులను అదుపులోకి తీసుకొని మూడు బైకులను, మొబైల్, 1700 రూపాయల నగదును స్వాధీనం చేసుకున్నామని తెలిపారు. చట్ట విరుద్ధ కార్యకలాపాలకు పాల్పడిన వారు ఎంతటి వారినైనా క్షమించేది లేదన్నారు. మండలంలో అక్రమ గంజాయి, నాటు సారా తయారీపై ప్రత్యేక దృష్టి సారించామని తెలిపారు.

అభివృద్ధి, సంక్షేమమే ధ్యేయం

ఎమ్మెల్యే బాబూరావు

ప్రజాశక్తి -నక్కపల్లి:అభివృద్ధి సంక్షేమమే ద్యేయంగా ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డి పాలన సాగిస్తున్నారని ఎమ్మెల్యే గొల్ల బాబురావు అన్నారు. మండలంలోని ఉపమాకలో సోమవారం గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించారు. అధికారులు, పార్టీ నాయకులు, కార్యకర్తలతో కలిసి గ్రామంలో పర్యటించారు. గడపగడపకు వెళ్లి సంక్షేమ పథకాలకు సంబంధించిన కరపత్రాలను లబ్ధిదారులు అందజేసి సంక్షేమ ఫలాలపై ఆరా తీశారు. ఉపమాక పంచాయతీ మామిడివానిపాలెంలో జల జీవన్ మిషన్ పనులకు శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ. ఈ పథకంతో ఇంటింటికీ తాగునీరు అందించనున్నట్లు తెలిపారు. మునుపెన్నడూ లేని విధంగా ప్రభుత్వం రాష్ట్ర ప్రజలకు సుపరిపాలన అందిస్తున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీ రత్నం, జడ్పిటిసి సభ్యురాలు కాసులమ్మ, వైస్ ఎంపీపీ నానాజీ, పార్టీ మండల శాఖ అధ్యక్షులు శీరం నరసింహ మూర్తి, నక్కపల్లి పిఎసిఎస్ పర్సన్ ఇన్‌చార్జి ఎలమంచిలి తాతబాబు, మాజీ ఎంపీటీసీ సభ్యులు కొప్పిశెట్టి హరిబాబు, వైసీపీ నాయకులు కొల్లాటి బుజ్జి ,సిద్దాబత్తుల నూకతాత, మనబాల తాతారావు, సత్తిబాబు, సూరకాసుల గోవింద్, గొర్ల బాబురావు, తహసీల్దార్ అంబేద్కర్, ఎంపీడీవో శ్రీనివాసరావు, ఈ ఓపిఆర్‌డి వెంకటనారాయణ, పంచాయతీ కార్యదర్శి జయప్రకాష్ పాల్గొన్నారు.


సంక్షేమ కరపత్రం అందజేస్తున్న ఎమ్మెల్యే


వినతిపత్రం ఇస్తున్న గిరిజనులు, నాయకులు

రోడ్డు నిర్మాణం చేపట్టాలి

ప్రజాశక్తి -కోటవురట్ల:జగ్గంపేట శివారు తడపర్తి, శ్రీరాంపురం రోడ్డు నిర్మాణం చేపట్టాలని సోమవారం తహసిల్దార్ కార్యాలయం వద్ద ఆయా గ్రామాలకు చెందిన గిరిజనులు నిరసన చేపట్టారు అనంతరం తహసిల్దార్ జానకమ్మకు వినతిపత్రం అందజేశారు. తడపర్తి. శ్రీరాంపురం రోడ్డు నిర్మాణం అసంపూర్తిగా వదిలివేయడంతో తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నామని తెలిపారు. వెంకటాపురం నుంచి సుమారు కిలోమీటర్ మేర రోడ్డు నిర్మాణం చేపట్టి అటవీ శాఖ భూములు ఉన్నాయనే కారణంతో నిర్మాణం మధ్యలో నిలిపివేశారని చెప్పారు. వాస్తవానికి అటవీ శాఖకు సంబంధించిన భూమి కిలోమీటర్ మాత్రమే ఉందని, గతంలో జిల్లా కలెక్టర్‌కు విన్నవించామని తెలిపారు. అధికారులు స్పందించి రోడ్డు నిర్మాణానికి అనుమతి మంజూరు చేసి నిర్మాణం చేపట్టాలని కోరారు. ఈ కార్యక్రమంలో మాజీ మండల ఉపాధ్యక్షులు సత్యనారాయణరాజు, బాబురావు, రమణ, గ్రామస్తులు పాల్గొన్నారు.


మాట్లాడుతున్న అయ్యన్న

వచ్చే ఎన్నికల్లో టిడిపిదే గెలుపు

- మాజీ మంత్రి అయ్యన్నపాత్రుడు

ప్రజాశక్తి నర్సీపట్నం టౌన్:వచ్చే ఎన్నికల్లో తెలుగుదేశం పార్టీకి పట్టం కట్టేందుకు ప్రజలు సిద్దంగా ఉన్నారని మాజీమంత్రి చింతకాయల అయ్యన్నపాత్రుడు ధీమా వ్యక్తం చేశారు. తన స్వగృహంలో సోమవారం నియోజవర్గ క్లస్టర్ల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా అయ్యన్న మాట్లాడుతూ, నర్సీపట్నం నియోజక వర్గంలో నాతవరం మండలం మన్యపుఉరట్ల, మాకవరపాలెం మండలం కోడూరు, గొలుగొండ మండలం కృష్ణదేవిపేట గ్రామం నుండి వైసీపీ పార్టీ నుండి తెలుగదేశం పార్టీ లో చేరిన వారికి ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. విశాఖలో రూ.300 కోట్ల స్థలం విజయసాయిరెడ్డికి అప్పజెప్పడానికి ఒప్పందం కుదిరిందని విమర్శించారు. విశాఖ పట్నానికి రక్షణ కవచం వంటి కొండని కొల్ల గొట్టడం దౌర్భాగ్యమన్నారు. ఓటర్ వెరిఫికేషన్‌ను పార్టీ ఇన్చార్జులు పరిశీలించాలన్నారు. క్లస్టర్ ఇంచార్జీలకు ట్రైనింగ్ ఇవ్వడం జరిగిందన్నారు. ఈ కార్యక్రమంలో చింతకాయల రాజేష్, నియోజకవర్గంలో నాలుగు మండలాల కు చెందిన పార్టీ ప్రెసిడెంట్లు, నాయకులు, క్లస్టర్ ఇంచార్జీలు పాల్గొన్నారు.

వైభవంగా ఆలయ వార్షికోత్సవం

ప్రజాశక్తి -నక్కపల్లి:స్థానిక ఉపమాక రోడ్డు సమీపంలో సాయిబాబా ఆలయ ప్రథమ వార్షికోత్సవ వేడుకలను సోమవారం వైభవంగా నిర్వహించారు. ఆలయ వార్షికోత్సవం సందర్భంగా పెద్ద సంఖ్యలో భక్తుల తరలివచ్చి స్వామివారిని దర్శించుకున్నారు. అనంతరం ఆలయం వద్ద అన్న సమారాధన నిర్వహించారు.